



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

బుధవారం, జనవరి 01, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 10 | వెల 4/-


# నయా సాల్ జోష్



- ప్రపంచవ్యాప్తంగా న్యూ ఇయర్ సంబరాలు
- మున్ముందు కిరిబాటీ, చివరగా న్యూ సమోవా
- 2025కు వేడుకగా స్వాగతం పలికిన ప్రజలు

న్యూఢిల్లీ: ఆంగ్ల సంవత్సరాది సర్వత్రా నూతనోత్తేజం నింపింది. వేడుకలు, పార్టీలతో ఉత్సవ వాతావరణం నడుమ ప్రపంచవ్యాప్తంగా ప్రజలు న్యూ ఇయర్‌కు స్వాగతం పలికారు. ఏ దేశంలో చూసినా ప్రఖ్యాత పర్యాటక ప్రాంతాలన్నీ భారీ జనసందోహంతో కిటకిటలాడాయి. వాణిజ్య సముదాయాలు, హోటళ్లు తదితరాలు కళకళలాడాయి. ఎప్పట్లాగే క్రిస్మస్ ఐలాండ్‌గా పేరొందిన కిరిబాటీ రిపబ్లిక్ 2025ను స్వాగతించిన తొలి దేశంగా నిలిచింది. ఎంత ముందుగా అంటే, అమెరికా కాలమానం ప్రకారం డిసెంబర్ 31 ఉదయం ఐదింటికే అక్కడ నూతన సంవత్సర వేడుకలు మొదలైపోయాయి! తర్వాత పావు గంటకే పసిఫిక్ మహాసముద్రానికి దక్షిణాన ఉన్న చాదం ఐలాండ్స్‌లో, ఆ వెంటనే న్యూజిలాండ్‌లో న్యూ ఇయర్ వేడుకలు జరుపుకున్నాయి.అర్ధరాత్రి క్యాలెండర్ మారి 2024 డిసెంబర్ 31 కాలగర్భంలో కలిసిపోతూనే న్యూజిలాండ్‌లోని ఆక్లండ్ నగరంలో సంబరాలు మిన్నంటాయి. తర్వాత ఆస్ట్రేలియా, జపాన్ తదితర దేశాలూ వేడుకల్లో పాలుపంచుకున్నాయి. ఆస్ట్రేలియాలోని చారిత్రక సిడ్నీ మార్బర్ బ్రిడ్జి బాణసంచా పేలుళ్లు, కళ్లు మిరుమిట్లుగొలిపే లేజర్ షోలతో పట్టపగలును తలపించింది. బ్రెజిల్‌లోని

- మిగతా 2వ పేజీలో

# తీర్పు ఇచ్చేదాకా అరెస్టు వద్దు

హైకోర్టు ఆదేశం.. కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై తీర్పు రిజర్వు

హెచ్ఎండీఏ నిధులను రేస్‌లకు వినియోగించవచ్చా?

దర్యాప్తు ఏ దశలో ఉంది? ఇప్పటివరకు ఏం చేశారు?

ఫార్ములా ఈ-రేస్ కేసులో ఏసీబీకి ధర్మాసనం ప్రశ్నలు

ఆర్థికశాఖ అనుమతి.. క్యాబినెట్ ఆమోదం లేదు

ఒప్పందానికి ముందు చెల్లింపులు ఎలా చేస్తారు?

గంపగుత్తగా నిబంధనలు ఉల్లంఘన: ఏసీబీ, ప్రభుత్వం

ఉల్లంఘనే నేరం జరిగినట్లు కాదు: కేటీఆర్ న్యాయవాదులు



హైదరాబాద్,: ఫార్ములా ఈ-రేస్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌కు హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఈ కేసులో కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌లో తీర్పు వెలువరించే వరకు ఆయనను అరెస్ట్ చేయరాదని హైకోర్టు పేర్కొంది. ఈ మేరకు తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది. ఏసీబీ దర్యాప్తును మాత్రం యథావిధిగా చేసుకోవచ్చని

- మిగతా 2వ పేజీలో

# ఆన్‌లైన్‌లో బ్రేక్ దర్శనాల బుకింగ్!

- ప్రజాప్రతినిధులకు ప్రత్యేక యూజర్ ఐడీ, పాస్‌వర్డ్
- కోటా ప్రకారం వారే నేరుగా బుక్ చేసుకొనేలవకాశం



తిరుమలకు వచ్చే భక్తులకు శ్రీవారి దర్శనం సులభతరంగా, సౌకర్యవంతంగా ఉండేలా టీటీడీ చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే సామాన్య భక్తుల దర్శన నిరీక్షణ సమయాన్ని తగ్గించడంపై కసరత్తు చేస్తున్న ఉన్నతాధికారులు రానున్న రోజుల్లో ప్రజాప్రతినిధులే నేరుగా బ్రేక్ దర్శన టికెట్లు బుక్ చేసుకునేలా ఆలోచన చేస్తున్నారు. నిత్యం దాదాపు 60-70వేల మంది భక్తులు శ్రీవారిని

- మిగతా 2వ పేజీలో

# మణిపూర్ సీఎం క్షమాపణ

## హింసలో 200 మందికిపైగా మరణించారు

## కొత్త ఏడాదిలోనైనా శాంతి నెలకొనాలి: బీరేన్ సింగ్

ఇంఫాల్/న్యూఢిల్లీ, డిసెంబరు 31: జాతుల వైరం సుదీర్ఘకాలంగా కొనసాగుతుండటంపై మణిపూర్ సీఎం బీరేన్ సింగ్ ప్రజలకు క్షమాపణలు చెప్పారు. మైతేయి, కుకీ తెగల మధ్య ఘర్షణతో 2023 మే నుంచి ఆ రాష్ట్రంలో హింస కొనసాగుతోంది. 250 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. వేలాదిమంది ఇళ్లను వీడిపోయారు. ఇప్పటికీ అనేకమంది పునరావాస కేంద్రాల్లోనే తలదాచుకుంటున్నారు. దీనిపై మంగళవారం మీడియా ఎదుట విచారం



2లో

# కార్పొరేట్ స్థాయిలో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు

- తొలిదశలో నాలుగు జిల్లాల్లో నిర్మాణం
- గచ్చిబౌలిలో మోడల్ రిజిస్ట్రేషన్ ఆఫీసు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

2లో





# 15 రోజుల్లో ఇరిగేషన్ ఇంజనీర్లకు ప్రమోషన్లు

నీటిపారుదల శాఖలో మరో 1,300 ఉద్యోగాల భర్తీ

ఇంజనీర్లు కచ్చితంగా పని ప్రదేశాల్లోనే నివసించాలి

నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఇరిగేషన్‌ను బీఆర్ఎస్ సర్కారు అస్తవ్యస్తం చేసిందని ఆగ్రహం

ఆర్ఆర్ఆర్‌ను గాడిలోకి తెచ్చింది నేనే: మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్: నీటిపారుదల శాఖలోని అన్ని స్థాయిల ఇంజనీర్లకు 15 రోజుల్లోగా పదోన్నతులు, బదిలీలు చేపడుతామని ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇంజనీర్లు పనిచేసే ప్రాంతంలోనే నివాసం ఉండాలని స్పష్టంచేశారు. బాధ్యతలను విస్మరిస్తే

(మిగతా 2వ పేజీలో)

# 6 వేలు కాదు.. 10 వేలు



కిసాన్ నిధి కింద ఏటా ఇస్తున్న మొత్తం పెంపు

వచ్చే బడ్జెట్‌లో వెల్లడించకముందే ప్రధాని ప్రకటన

ఏడాదికి ఇస్తున్న రూ.6 వేలను పెంచిన కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబరు 31: దేశవ్యాప్తంగా రైతులు, పేదలకు ప్రధాని మోదీ నూతన సంవత్సర కానుకలు ప్రకటించారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద అన్నదాతలకు అందిస్తున్న పెట్టుబడి సాయాన్ని పెంచుతున్నట్లు తెలిపారు. అలాగే దేశంలో పేదల కోసం మరో 2 కోట్ల ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సర్వే చేయాలని నిర్ణయించారు. 2019 నుంచి మోదీ సర్కారు ఏటా రైతులకు రూ.6 వేలు పెట్టుబడి సాయం అందిస్తోంది. రూ.2 వేల చొప్పున మూడు విడతల్లో అన్నదాతల ఖాతాల్లో సొమ్మును జమ చేస్తున్నారు. ఈ మొత్తాన్ని ఇప్పుడు రూ.10 వేలకు పెంచుతున్నట్లు మోదీ 'ఎక్స్'లో తెలిపారు. రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు వారి ఖాతాల్లో నేరుగా రూ.10 వేలు జమ చేయనున్నట్లు ప్రకటించారు. కిసాన్ నిధిని పెంచేందుకు కేంద్రం కసరత్తు చేస్తోందని.. ఆర్థిక మంత్రి నిర్మల త్వరలో ప్రవేశపెట్టే 2025-26 బడ్జెట్‌లో ప్రకటన చేసే అవకాశాలున్నాయని అధికార వర్గాలు ఇదివరకే పేర్కొన్నాయి. అయితే దానికి ముందే ఆ మొత్తాన్ని రూ.10 వేలకు పెంచుతున్నట్లు మంగళవారం ప్రధాని స్వయంగా వెల్లడించడం గమనార్హం. రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఆరేళ్లుగా అమలు చేస్తున్న ఈ పథకానికి దేశవ్యాప్తంగా విశేష ఆదరణ ఉంది. రైతులకు పంట సాయం కింద బాగా ఉపయోగపడుతోంది. ఇప్పటి వరకు కేంద్రం 18 వాయిదాలు చెల్లించింది. కొత్త ఏడాది ఫిబ్రవరిలో 19వ వాయిదా జమ కోసం రైతులు ఎదురుచూస్తున్న తరుణంలో ప్రధాని ప్రకటన వారిలో ఆనందోత్సాహాలు రేపింది.

### మరో 2 కోట్ల ఇళ్ల నిర్మాణంపై సర్వే

దేశంలో పేదల కోసం మరో 2 కోట్ల ఇళ్లను నిర్మించే విషయంపై సర్వే జరిపించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయిచింది. ప్రధాని మోదీ తరఫున నూతన సంవత్సర కానుకగా ఈ నిర్ణయం తీసుకుంది. 2025 మార్చి 31లోపు ఈ సర్వేను పూర్తి చేయాలని కేంద్రం నిర్ణయించింది. ప్రాధాన్య ప్రాతిపదికన ఈ సర్వేను మూడు నెలల్లో పూర్తి చేయాలంటూ డిసెంబరు 27న కేంద్రం అన్ని రాష్ట్రాలకూ లేఖ రాసింది. 'ఆవాస్ 2024' పేరిట రూపొందించిన యాప్‌లో ప్రజలు స్వయంగా సర్వేలో పాల్గొనేందుకు కేంద్రం అవకాశం కల్పించింది. గత సెప్టెంబరులోప్రధాని మోదీ ఈ యాప్‌ను ప్రారంభించారు. ఆధార్ ఆధారిత ఈ-కేవైసీ ద్వారా ప్రజలు సర్వేలో పాల్గొనే అవకాశం కల్పించారు. కాగా పేదలకు మరో 3 కోట్ల ఇళ్లు నిర్మిస్తామని బీజేపీ 2024 ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. అయితే రాబోయే నాలుగేళ్లలో అదనంగా 2 కోట్ల ఇళ్లు నిర్మించాలని కేంద్రం భావిస్తున్నట్లు గ్రామీణాభివృద్ధి శాఖ మంగళవారం విడుదల చేసిన వార్షిక నివేదికలో పేర్కొంది. మొత్తం 3.33 కోట్ల ఇళ్లను రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేటాయించగా, అందులో 3.22 కోట్ల ఇళ్లు మంజూరయ్యాయని.. 2.68 కోట్ల ఇళ్లు నిర్మించారని తెలిపింది. పీఎంఏవై గ్రామీణ లబ్ధిదారులను గుర్తించేందుకు కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత ఫేస్ టెక్నాలజీని రూపొందించామని, దీనివల్ల మోసాలకు అవకాశం ఉండదని వెల్లడించింది.



# అలా అయితే పోలవరం క్లియరెన్స్ చెల్లుబాటు కాదు

ప్రాజెక్టుల టీఏసీకి పిలవలేదన్న ఏపీ అభ్యంతరాలకు తెలంగాణ కౌంటర్

పోలవరం తరహాలోనే తమ ప్రాజెక్టులపై సీడబ్ల్యూసీ వ్యవహరిస్తోందని బదులు

సీతారామ ఎత్తిపోతల-సీతమ్మసాగర్ ప్రాజెక్టుతో ఏపీకి ఇబ్బందుల్లేవు

వరద జలాల ప్రాజెక్టులకు నీటి హక్కుల కోసమే ఏపీ అభ్యంతరాలుఏపీ అభ్యంతరాలకు కౌంటర్ ఇస్తూ గోదావరి బోర్డుకు ఈఎన్‌సీ లేఖ

# అలా అయితే పోలవరం క్లియరెన్స్ చెల్లుబాటు కాదు

**పోలవరంపై టీఏసీకి మహారాష్ట్ర ఒడిసా, ఛత్తీస్‌గఢ్‌లను పిలవలేదు**

**ప్రాజెక్టుల టీఏసీకి పిలవలేదన్న ఏపీ అభ్యంతరాలకు తెలంగాణ కౌంటర్**

**పోలవరం తరహాలోనే తమ ప్రాజెక్టులపై సీడబ్ల్యూసీ వ్యవహరిస్తోందని బదులు**

**సీతారామ ఎత్తిపోతల-సీతమ్మసాగర్ ప్రాజెక్టుతో ఏపీకి ఇబ్బందుల్లేవు**

**గోదావరి జలాల పంపిణీకి ట్రైబ్యునల్ వాదన అర్థరహితం**

**వరద జలాల ప్రాజెక్టులకు నీటి హక్కుల కోసమే ఏపీ అభ్యంతరాలు**

**ఏపీ అభ్యంతరాలకు కౌంటర్ ఇస్తూ గోదావరి బోర్డుకు ఈఎన్‌సీ లేఖ**



హైదరాబాద్, డిసెంబరు 31 : 'తెలంగాణలోని పలు ప్రాజెక్టులకు సాంకేతిక అనుమతినిచ్చే విషయంలో జరిగిన సాంకేతిక సలహా కమిటీ (టీఏసీ)కి దిగువ పరీవాహక రాష్ట్రమైన తమను పిలవలేదనే ఏపీ వాదన అర్థరహితం. కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) అంతర్గతంగా తీసుకునే నిర్ణయాలకు తాము కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదని ఏపీ వాదించడం పూర్తిగా తప్పు. అట్లయితే ఎగువ పరీవాహకంలోని మహారాష్ట్ర, ఛత్తీసగడ్, ఒడిసాలను ఆహ్వానించకుండానే 2009లో టీఏసీ నిర్వహించి పోలవరం ప్రాజెక్టుకి ఇచ్చిన అనుమతులు కూడా చెల్లుబాటు కావు' అని తెలంగాణ రాష్ట్రం స్పష్టం చేసింది. సీతారామ ఎత్తిపోతల పథకం-సీతమ్మసాగర్ బహుళార్థక సాధక ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీలోని టీఏసీ క్లియరెన్స్‌కి సిఫారసు చేస్తూ గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశంలో చేసిన తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ బోర్డుకు ఇటీవల ఏపీ లేఖ రాసింది. డీపీఆర్‌ల పరిశీలనకు 1996 మార్గదర్శకాలను అనుసరించామని సీడబ్ల్యూసీ అంటోందని, ఆ మార్గదర్శకాలేమిటో చెప్పాలని కోరితే ఇవ్వడం లేదని, ప్రస్తుతం 2017 మార్గదర్శకాలు అమల్లో ఉండగా, 1996 మార్గదర్శకాలతో తెలంగాణ ప్రాజెక్టులకు క్లియరెన్స్ ఇవ్వడమేమిటి?' అని ఆ లేఖలో ఏపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఏపీ అభ్యంతరాలను తోసిపుచ్చుతూ తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ గుమ్మడి అనిల్‌కుమార్ సోమవారం గోదావరి బోర్డుకు లేఖ రాశారు. సీడబ్ల్యూసీ పోలవరం ప్రాజెక్టుకు 2009, 2011లో క్లియరెన్స్‌లను తమ 1996 మార్గదర్శకాల ప్రకారమే ఇచ్చిందని, వాటి ప్రకారమే తెలంగాణ ప్రాజెక్టుల విషయంలో నడుస్తోంది' అని లేఖలో తెలంగాణ బదులిచ్చింది. న్యాయస్థానానికి వెళ్లక తప్పని పరిస్థితి కల్పించారని లేఖలో ఏపీ హెచ్చరించగా, తప్పుడు ఉద్దేశాలతో ఏపీ కేసులేసినా నిలబడవని తెలంగాణ కౌంటర్ ఇచ్చింది.

సీతారామ ఎత్తిపోతల పథకం-సీతమ్మసాగర్ బహుళార్థక ప్రాజెక్టుపై తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా తమ హక్కులకు ఎలాంటి నష్టం ఉండదని సీడబ్ల్యూసీ చెప్పడం సరికాదని ఏపీ తప్పుబట్టింది. అయితే ఈ అభ్యంతరాలన్నింటికీ సీడబ్ల్యూసీతో పాటు టీఏసీలు పరిగణనలోకి తీసుకుని ఏపీ హక్కులకు ఎలాంటి ఇబ్బంది భంగం కలుగదని తేల్చాయని తెలంగాణ వివరించింది. ఇచ్చంపల్లి ప్రాజెక్టు ద్వారా నీటి వినియోగంపై గోదావరి ట్రైబ్యునల్ విధించిన ఆంక్షలను పరిగణనలోకి తీసుకోకుండానే సీతారామ ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ క్లియరెన్స్ ఇచ్చిందని, ఇది ట్రైబ్యునల్ తీర్పు ఉల్లంఘన కిందికి వస్తుందని ఏపీ ఆరోపించింది. 35 టీఎంసీలతో దేవాదుల, 195 టీఎంసీలతో కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టడంతో ఆ 85 టీఎంసీలను తెలంగాణ వాడుకున్నట్లేనని, దాంతో సీతారామ ప్రాజెక్టుకు నీటి లభ్యత లేదనే విషయాన్ని ఏపీ స్పష్టం చేసింది. ట్రైబ్యునల్ ఆంక్షలు కేవలం ఇచ్చంపల్లి ప్రాజెక్టుకే పరిమితమని, ఆ ప్రాజెక్టును చేపట్టలేదని తెలంగాణ బదులిచ్చింది. ట్రైబ్యునల్ మార్గదర్శకాలకు లోబడే దేవాదుల, కాళేశ్వరంతో పాటు పోలవరం ప్రాజెక్టులకు సీడబ్ల్యూసీ అనుమతిలిచ్చిందని తెలిపింది. సీడబ్ల్యూసీ ట్రైబ్యునల్ లాగా నీటికేటాయింపులు జరపడం లేదని, కేవలం ప్రాజెక్టులకు అనుమతులిస్తోందని గుర్తు చేసింది. కాగా అంతర్రాష్ట్ర జలవివాదాల చట్టం-1956లోని సెక్షన్-3 కింద ఏపీ, తెలంగాణ మధ్య గోదావరి జలాల పంపకాలకు ట్రైబ్యునల్ ఏర్పాటు చేయాలని ఏపీ కోరగా, ఏమాత్రం అవసరం లేదని తెలంగాణ స్పష్టం చేసింది.

# 15 రోజుల్లో ఇరిగేషన్ ఇంజనీర్లకు ప్రమోషన్లు



కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని సాగునీటి ప్రాజెక్టులపై మంగళవారం జలసౌధలో జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బి.లక్ష్మారెడ్డి ఫిర్యాదు ఆధారంగా మిర్యాలగూడ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను మంత్రి సస్పెండ్ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇరిగేషన్ శాఖను గాడిలో పెట్టేందుకు 700 మందికి పైగా ఏఈఈలను నియమించామని, అందులో దాదాపు 100 మంది ఐఐటీ, ఎన్ఐటీల గ్రాడ్యుయేట్లు ఉన్నారని మంత్రి ఉత్తమ్ తెలిపారు. కాల్వలపై పర్యవేక్షణకు 1,800 మంది లష్కర్లను నియమిస్తున్నామని చెప్పారు. నీటిపారుదల శాఖలో మరో 1,300 పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని టీజీపీఎస్సీకి లేఖ రాసినట్లు వెల్లడించారు. ఉమ్మడి ఏపీకి ఉన్న 811 టీఎంసీల కృష్ణా జలాల వాటా నుంచి రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీలను కేటాయించడాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం రాతపూర్వకంగా సమ్మతించిందని తప్పుబట్టారు. తెలంగాణకు 550 టీఎంసీలు కేటాయించాలని కృష్ణా ట్రిబ్యునల్%-%2 ఎదుట వాదనలు వినిపిస్తున్నామని, ఆరు నెలల్లో సానుకూల తీర్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**అప్పుల చెల్లింపులకే సగం నిధులు**

బీఆర్ఎస్ ప్రభుత్వ 10 ఏళ్ల పాలనలో నీటిపారుదల శాఖ అస్తవ్యస్తంగా మారిందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు, కాల్వల నిర్వహణను నాడు పూర్తిగా గాలికి వదిలేశారని మండిపడ్డారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి బీఆర్ఎస్ సర్కారు రూ.1.81 లక్షల కోట్లు అప్పు చేసినా ఆయకట్టు మాత్రం అభివృద్ధి కాలేదని అన్నారు. ఈ అప్పులభారం నీటిపారుదల శాఖపై తీవ్రంగా పడిందని తెలిపారు. బడ్జెట్‌లో ఈ శాఖకు రూ.22 వేల కోట్లు కేటాయిస్తే, రూ.11 వేల కోట్లు అప్పుల చెల్లింపులకే పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులను పునర్వ్యవస్థీకరించి, వడ్డీలను తగ్గించడంతో పాటు కాలపరిమితి పెంచడం ద్వారా శాఖపై భారం తగ్గించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**కేటీఆర్‌ను ప్రశాంతంగా వేడుకలు చేసుకోనీయండి: కోమటిరెడ్డి**

ఫార్ములా-ఈ రేసు కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ కేసు గురించి మీడియా ప్రశ్నించగా.. కొత్త సంవత్సరం సందర్భంగా కేటీఆర్‌ను రెండుమూడు రోజులు ప్రశాంతంగా వేడుకలు చేసుకోనీయండి అని సెటైర్ వేశారు. రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) కోసం బీఆర్ఎస్ హయాంలోనే 70 శాతం భూసేకరణ పూర్తిచేశామన్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రకటనను కోమటిరెడ్డి కొట్టిపారేశారు. గత ప్రభుత్వం యుటిలిటీ చార్జీలు కట్టకపోతే ప్రాజెక్టు నిలిచిపోగా, తాను కేంద్ర మంత్రి గడ్కరీని కలిసి ప్రాజెక్టును రివైవ్ చేయించినట్టు తెలిపారు. సమీక్షలో ఎమ్మెల్యేలు మందుల సామేలు, లక్ష్మారెడ్డి, బాలూనాయక్, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత మాసాన్ని విజయవంతం చేయండి

## అవగాహన కార్యక్రమాలు, కంటి పరీక్షలు నిర్వహించండి: పొన్నం

హైదరాబాద్, డిసెంబరు 31 : ప్రతి సంవత్సరం జనవరిలో నిర్వహించే జాతీయ రోడ్డు భద్రత మాసాన్ని విజయవంతం చేయాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారుల్ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోలీసు, విద్యాశాఖతోపాటు ఇతర ప్రభుత్వ విభాగాలు భాగస్వామ్యం కావాలని మంత్రి సూచించారు. బుధవారం నుంచి జరిగే జాతీయ రోడ్డు భద్రత మాసంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఐఏఎస్, ఐపీఎసలు భాగస్వామ్యం అయ్యేలా చూడాలని రవాణా శాఖ అధికారులకు సూచించారు. డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించేందుకు శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు.

## 125.50 కోట్ల మంది మహిళలకు రూ. 4225 కోట్ల విలువైన ఉచిత ప్రయాణం

ప్రజా పాలనలో 2024లో రవాణా శాఖ అత్యుత్తమ పనితీరు కనబర్చిందని మంత్రి పొన్నం ప్రభార్ తెలిపారు. 2024లో రవాణా శాఖ సాధించిన విజయాల్ని మంత్రి వెల్లడించారు. విద్యుత్ వాహన పాలసీలో జీహెచ్ఎంసీ పరిధిలో ఏటా సగటున 5 లక్షల వాహనాలను చేర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడ్డ 48 గంటల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామన్నారు. ఇప్పటి వరకు 125.50 కోట్లమంది మహిళలు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని వినియోగించుకున్నారన్నారు. రూ. 4,225 కోట్ల ప్రయాణ ఖర్చులను మహిళలు ఆదా చేసుకున్నారన్నారు.

# కార్పొరేట్ స్థాయిలో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు

## తొలిదశలో నాలుగు జిల్లాల్లో నిర్మాణం

## గచ్చిబౌలిలో మోడల్ రిజిస్ట్రేషన్ ఆఫీసు: మంత్రి పొంగులేటి

హైదరాబాద్, డిసెంబరు 31 : ప్రజలకు పారదర్శకమైన సేవలను అందించేందుకు వీలుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను కార్పొరేట్ స్థాయిలో పునర్ వ్యవస్థీకరణ చేయనున్నట్లు రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సీఎస్ఆర్ నిధుల ద్వారా ఆధునిక హంగులతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మించబోతున్నట్లు చెప్పారు. ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా మెరుగైన వసతులు కల్పించడమే ధ్యేయంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్ వ్యవస్థీకరణ చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా అత్యాధునిక వసతులతో శాశ్వత భవనాలను నిర్మించాలని, ఇందుకు అవసరమైన భూములను గుర్తించాలని రంగారెడ్డి, మెదక్, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుండగా 37 మాత్రమే సొంత భవనాలు కలిగి ఉన్నాయని, మిగిలినవన్నీ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, ఈ పరిస్థితిలో మార్పు తీసుకొచ్చేలా కార్పొరేట్ స్థాయిలో నూతన కార్యాల యాల నిర్మాణం చేపడతామన్నారు. తొలి దశలో సంగారెడ్డి జిల్లాలో సంగారెడ్డి, పటాన్‌చెరు, మేడ్చెల్ జిల్లాలో మేడ్చెల్, కుత్బుల్లాపూర్, ఉప్పల్‌లో, రంగారెడ్డి జిల్లాకు సంబంధించి కందుకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఫోర్త్ సిటీలో నిర్మించనున్నట్లు వెల్లడించారు. అలాగే, గండిపేట, శేరిలింగంపల్లి కార్యాలయాలతో పాటు, రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్‌ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ (తాలిమ్) వద్ద మోడల్ ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంగా నిర్మించనున్నట్లు చెప్పారు. జనవరిలోనే దీనికి శంకుస్థాపన జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ జిల్లాకు సంబంధించి బంజారాహిల్స్, ఎస్ఆర్‌నగర్, గోల్కొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు షేక్‌పేట ప్రాంతంలో ఒకే చోట నిర్మించాలని నిర్ణయించామన్నారు.

# రేవంత్‌రెడ్డి ఏడాది పాలన విఫలం

హైదరాబాద్, డిసెంబరు 31 : "కాంగ్రెస్ సర్కార్ వంద రోజుల్లో అమలు చేస్తామన్న గ్యారెంటీలు 390 రోజులయినా మొదలుపెట్టలేదు. 2024లో ప్రభుత్వ పరంగా వైఫల్యాలు తప్ప విజయాల్లేవు. రేవంత్‌రెడ్డి ఏడాది పాలనపై పలు సర్వే ఏజెన్సీలు ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకునే ప్రయత్నంచేస్తే.. ఏ సర్వేలోనూ ఆయనకు పాస్ మార్కులు రాలేదు. ప్రజల దృష్టిలో ఆయన ఫెయిల్ అయ్యారు" అని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. రేవంత్ పాలన గురించి ఎవరిని అడిగినా ఆయన్ను తిడుతున్నారనే సమాధానం వస్తోందని తమదృష్టికి వచ్చిందని మంగళవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో, దేశవిదేశాల్లో ఉన్న తెలంగాణ ప్రజలకు హరీశ్ రావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2024లో రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన విఫలమయిందని విమర్శలు చేశారు. లక్షలకోట్ల అప్పులంటూ.. అసెంబ్లీలో కూడా అడ్డూ అదుపులేకుండా అబద్ధాలు చెబుతున్నారన్నారు. రేవంత్ బ్రదర్స్ రాజ్యాంగేతర పనులు శృతి మించుతున్నా యని పేర్కొన్నారు.

# 6 వేలు కాదు.. 10 వేలు

కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత ఫేస్ టెక్నాలజీని రూపొందించామని, దీనివల్ల మోసాలకు అవకాశం ఉండదని వెల్లడించింది.

**మోదీ కొత్త సంవత్సర శుభాకాంక్షలు**

ఆకాంక్షల భారతావనికి ప్రధాని మోదీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. "అంతరిక్షం నుంచి భూమి వరకు.. రైల్వేస్ నుంచి రన్‌వేస్ దాకా.. సంస్కృతి నుంచి ఆవిష్కరణ వరకు.. 2024లో భారత్ గణనీయ పురోగతిని, పరివర్తనను సాధించింది. ప్రగతి దిశగా నా భారత్ వడివడిగా అడుగులేస్తోంది. మేరా భారత్ బఢ్ రహా" అని 'ఎక్స్'లో తెలిపారు. 2025లోకి విశ్వాసంతో అడుగుపెడుతున్న తరుణంలో తన ట్వీట్‌ను కవితా వేడుకగా అభివర్ణించారు. 2024లో భారత విజయాలను, చేరుకున్న మైలురాళ్లను వివరించే 2.41 నిమిషాల వీడియోను ఈ సందర్భంగా ఆయన పోస్టు చేశారు. ఇందులో అంతరిక్ష ప్రయోగాల విజయాలు, సూపర్-కంప్యూటింగ్, రక్షణ ఉత్పత్తుల పెంపు, పౌరవిమానయాన పరిశ్రమ వృద్ధి, హౌరా మైదాన్ అండర్‌వాటర్ మెట్రో, రామేశ్వరం రైలు వంతెన, వందే భారత్ రైళ్లు, దేశవ్యాప్తంగా వైద్యకళాశాలల పెంపు, ఆరోగ్య సౌకర్యాల మెరుగుదల, అటల్ పెన్షన్ స్కీం, పీఎం ఆవాస్ యోజన, అబుదాబిలో దేవాలయ ప్రతిష్ఠ, మూడు కొత్త క్రిమినల్ చట్టాల అమలు మొదలైనవాటి ప్రస్తావన ఉంది. 2024లో తన ప్రభుత్వ ప్రోగ్రెస్ రిపోర్టు కార్డు ఉంది. విదేశీ మారక ద్రవ్య నిల్వలు 70 వేల కోట్ల డాలర్లకు చేరుకోవడం సహా ఆర్థిక రంగానికి సంబంధించిన ప్రత్యేక సమాచారాన్ని కూడా అందులో పొందుపరిచారు. ఆసియాలో మూడో అతిపెద్ద శక్తిగా భారత్ ఆవిర్భవించడం.. ఉపాధి కల్పన రంగంలో 4.1 కోట్ల మంది యువతకు రూ.2 లక్షల కోట్ల ప్యాకేజీ అందించడం, క్రీడల రంగంలో.. పారా-ఒలింపిక్స్‌లో రికార్డు స్థాయిలో 29 పతకాలు సాధించడం.. పర్యావరణహితం కోరి 'అమ్మ పేరుతో ఒక మొక్క నాటుదాం (ఏక్ పేడ్ మా కే నామ్)' అన్న సందేశం.. గ్రీన్ పవర్ ఉత్పత్తి సామర్థ్యం మొదలైనవాటిని కూడా వివరించారు. సమష్టి కృషితో 2024లో అనేక విజయాలు అందుకున్నామన్నారు. 2025లో మరింత కష్టించి 'వికసిత్ భారత్' కలను సాకారం చేసుకుందామని తెలిపారు. కొత్త సంవత్సరం అందరికీ పురోగతి, శాంతి, ఆరోగ్యం అందిస్తుందన్న ఆశాభావాన్ని మోదీ వ్యక్తంచేశారు.



# తీర్పు ఇచ్చేదాకా అరెస్టు వద్దు

పలు ప్రశ్నలు వేసింది. హెచ్ఎండీఏ నిధులను ఇలాంటి రేసింగ్‌ల కోసం వినియోగించవచ్చా? ఏ నిబంధనల ప్రకారం ఈ -రేసింగ్‌కు ఖర్చు చేశారు? అని ప్రశ్నించింది. మిగతా ఇద్దరు నిందితులు అర్వింద్‌కుమార్, బీఎల్ఎన్ రెడ్డి పిటిషన్‌లు దాఖలు చేశారా? దర్యాప్తు ఎంతవరకు వచ్చింది? ఇప్పటివరకు ఏంచేశారు? అని ఆరా ?తీసింది. దర్యాప్తుపై తాము స్టే ఇవ్వలేదని గుర్తు చేసింది. విదేశీ సంస్థ అయిన ఫార్ములా ఈ-ఆపరేషన్స్ (ఎఫ్ఈవో)కు అక్రమంగా రూ.54 కోట్లు చెల్లించారంటూ మునిసిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ చేసిన ఫిర్యాదుతో కేటీఆర్‌పై ఏసీబీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసును కొట్టేయాలని కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. కేటీఆర్ తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది సిద్ధార్థ దవే, గండ్ర మోహన్‌రావు, ప్రభాకర్‌రావు వాదనలు వినిపించారు. "ఏసీబీ నమోదు చేసిన సెక్షన్లకు కావాల్సిన ముడిసరుకు లేదు. ఎలాంటి నేరం లేకుండానే రాజకీయ కుట్రతో కేసు నమోదు చేశారు. నిధులు సొంతానికి వాడుకున్నట్లు, దుర్వినియోగం చేసినట్లు, నా వాళ్లకు లబ్ధి కలిగేలా వ్యవహరించినట్లు ఎక్కడా నిరూపించలేకపోయారు. చట్టబద్ధమైన ఒప్పందం మేరకు బ్యాంకు ద్వారా జరిగిన లావాదేవీ ఇది" అని కేటీఆర్ పేర్కొన్న అభిప్రాయాలను ఆయన తరఫు న్యాయవాదులు వివరించారు.

**ప్రతి ఉల్లంఘననూ నేరంగా పరిగణించలేం..**

ఉల్లంఘనలు జరిగి ఉండొచ్చని, కానీ.. నేరం జరగలేదని కేటీఆర్ న్యాయవాదులు తెలిపారు. ""ప్రతి ఉల్లంఘనకు క్రిమినాలిటీని అంటగట్టలేం. నా అధీనంలో ఉన్న ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేసినట్లు ఆరోపణ ఎక్కడా లేదు. అప్పటి మునిసిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి అర్వింద్‌కుమార్ రూపొందించిన ఫైల్‌కు నేను ఆమోదం తెలిపాను. అంతే తప్ప నేను ఏ ఒప్పందంపైనా సంతకాలు చేయలేదు. రెగ్యులేటరీల అనుమతి పొందాల్సిన బాధ్యత నాది కాదు. కేవలం నాపై ఈ కేసు పెట్టాలనే దురుద్దేశంతోనే గత ప్రభుత్వ వాయిదాలు ఎగవేసి ఒప్పందాన్ని ఉల్లంఘించింది. 'మహ్మద్ వాజిద్ ' కేసులో దురుద్దేశంతో పెట్టే కేసులను కొట్టేయాలని సుప్రీంకోర్టు చెప్పింది. దురుద్దేశం అనే ఒక్క కారణంతో ఈ కేసును కొట్టేవచ్చు. 'సతీశ్ శర్మ' కేసులో కేవలం అప్రూవల్ ఇచ్చినంత మాత్రాన మంత్రిని బాధ్యులను చేయలేమని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. విదేశీ కంపెనీతో ఒప్పందం చేసుకోవద్దని చట్టంలో ఎక్కడైనా ఉందా? అక్రమాలు జరిగినట్లు భావిస్తే.. విదేశీ కంపెనీపై ఎందుకు కేసు పెట్టలేదు? సదరు నిధులను వెనక్కి రప్పించడానికి ఏం చర్యలు తీసుకున్నారు? ఒప్పందం రద్దుకు ఏం చర్యలు తీసుకున్నారు?" అని కేటీఆర్ పేర్కొన్న విషయాన్ని న్యాయవాదులు కోర్టు దృష్టికి తెచ్చారు. కాగా, ఏసీబీ తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, ఫిర్యాదుదారైన మునిసిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ (రాష్ట్ర ప్రభుత్వం) తరఫున సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఇలాంటి రేసింగ్‌లకు హెచ్ఎండీఏ నిధులు ఖర్చు చేయకూడదన్నారు. ప్రస్తుత కేసులో నగర అభివృద్ధికి ఖర్చు చేశారా? నిందితుల అభివృద్ధికి ఖర్చు చేశారా? ఇతరుల అభివృద్ధికా? అనేది తేలాల్సి ఉందన్నారు. మిగతా ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయలేదని, దానకిశోర్ స్టేట్‌మెంట్‌పే రికార్డు చేశామని తెలిపారు. పిటిషనర్ (కేటీఆర్) దర్యాప్తును అడ్డుకోవాలనే ఉద్దేశంతో తొందరపడి హైకోర్టుకు వచ్చారని పేర్కొన్నారు.

**కేసుకు తగిన ముడిసరుకు ఉంది..!**

"గవర్నర్ ఆమోదం తీసుకున్న తర్వాతే కేసు నమోదు చేశాం. ఏసీబీ పెట్టిన సెక్షన్లకు కావాల్సిన ముడిసరుకు ఈ కేసులో పుష్కలంగా ఉంది. తన ఆదేశాలతోనే చెల్లింపులు జరిగినట్లు కేటీఆరే స్వయంగా అంగీకరించారు. పబ్లిక్ సర్వెంట్లు నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలి. చెల్లింపులు చేసే ముందు మంత్రిమండలి, ఆర్థికశాఖ అనుమతి పొందలేదు. హెచ్ఎండీఏ రూ.10 కోట్ల కంటే ఎక్కువ ఖర్చు చేస్తే తీసుకోవాల్సిన పరిపాలనా అనుమతి తీసుకోలేదు. సెక్రటేరియట్ బిజినెస్ రూల్స్ ఉల్లంఘించారు. విదేశీ మారకంలో చెల్లింపుల ద్వారా ఆర్బీఐ నిబంధనలు, ఎన్నికల కోడ్ ఉల్లంఘించారు. మొత్తమ్మీద గంపగుత్తగా నిబంధనల్ని తుంగలో తొక్కారు. విదేశీ సంస్థతో ఒప్పందానికి ముందు అంతపెద్ద మొత్తం ఎలా చెల్లిస్తారు? ఎఫ్ఐఆర్‌లో అన్ని వివరాలూ ఉండాలని లేదు. దర్యాప్తు జరుగుతున్న కొద్దీ నిందితుల తొలగింపు, కొత్త నిందితులను చేర్చడం జరుగుతుంటాయి. చార్జిషీట్‌లో సంపూర్ణంగా ఉంటాయి. పిటిషనర్ వాదనలన్నీ ట్రయల్ కోర్టులో చెప్పుకోవచ్చు. డబ్బు ఎవరి జేబుకు చేరిందనేది దర్యాప్తులో తేలుతుంది. ఈ దశలో జోక్యం చేసుకోరాదు" అని పేర్కొన్నారు. వాదనల సందర్భంగా పలు సుప్రీంకోర్టు తీర్పులతోపాటు 'చంద్రబాబునాయుడు' కేసు సైతం చర్చకు వచ్చింది. వాదనలు విన్న ధర్మాసనం.. తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది.

# రేషన్ షాపుల ద్వారా 14 రకాల వస్తువులను ఇవ్వాలి

## జాతీయ ఆహార భద్రత చట్టాన్ని అమలు చేయాలి...
## ఐద్వా కేంద్ర కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి డిసెంబర్ 31 : నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని రేషన్ షాపుల ద్వారా 14 రకాల వస్తువులను ఇవ్వాలని ఐద్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని వారం రోజులపాటు సర్వేలు చేసి కలెక్టరుకు మెమోరండం ఇవ్వాలని మహిళలకు పిలుపునిచ్చారు. చౌటుప్పల్ మండల కేంద్రంలోని ఐద్వా ఆధ్వర్యంలో కందాల రంగారెడ్డి భవనంలో జిల్లా వర్క్ షాపు అవ్వారు రామేశ్వరి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యవసర వస్తువులు బియ్యం ,పప్పులు,ఉల్లిగడ్డలు ,ఎల్లిగడ్డలు ,పండ్లు కూరగాయలు సమస్త వస్తువుల ధరలు పెరగడం వల్ల పేద ప్రజలపై భారాలు పడుతున్నాయని ఆవేదన చెందారు. ధరలు పెరగడం వల్ల 19 నుంచి 45 సంవత్సరాలు ఉన్న మహిళ లు 50 శాతం రక్తహీనత ఎదుర్కొంటున్నారని అన్నారు.పుట్టిన పిల్లలు పోషిక ఆహారం అందక బరువుకు తగ్గ ఎత్తు లేరు ఎత్తుకు తగ్గ బరువు లేరు మరోపక్క ఐదు సంవత్సరాల లోపు వయస్సు పిల్లలు 2.9 మంది మృత్యు వా త పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు .ఆకలి సూచిలో చూస్తే 127 దేశాలతో చూస్తే మన దేశము 105వ స్థానంలో 2024 సంవత్సరానికి సంబంధించి విడుదలైన 19వ జిహెచ్ఐ తెలియజేస్తే కేంద్ర ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు .పొరుగున ఉన్న దేశాలు నేపాల్ ,శ్రీలంక ,మయన్మార్, పాకిస్తాన్ ,ఆఫ్ఘనిస్తాన్ కంటే మన దేశం వెనుకబడి ఉందని ఆవేదన చెందారు స్వాతంత్ర భారత దేశంలో ఆకలితో అలమటించే అనాధలు ఉండడానికి వీల్లేదు ఏ ఒక్కరూ ఖాళీ కడుపుతో ఉండకూడదు ఉంటే ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉన్నట్లే కాబట్టి జాతీయ ఆహార భద్రత చట్టాన్ని తప్పనిసరిగా అమలు పరచాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని హెచ్చరించిన కేంద్ర ప్రభుత్వము నిమ్మకు నీరెత్తినట్లు ఉందని అన్నారు. వ్యవసాయం ఆహార భద్రత పౌష్టికాహార పంపిణీ పై దృష్టి పెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని ప డిమాండ్ చేశారు జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా నిత్యవసర వస్తువులపై మహిళల ఆలోచన విధానం ఎట్లా ఉంది అని వారి స్పందన ఎలా ఉందని సంతకాల సేకరణ చేసి వచ్చిన సమస్యలపై కలెక్టర్కు మెమోరండం ఇస్తామని అన్నారు .తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలను అమలు చేస్తామని ఉచిత బస్సు తప్ప ఏది పూర్తిస్థాయిలో అమలు కావట్లేదు మిగతా గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కల్లూరి నాగమణి ,సహాయ కార్యదర్శి మల్లేపల్లి లలిత ,జిల్లా కమిటీ సభ్యురాలు అండాలు, భువనగిరి టౌన్ కార్యదర్శి శారద ,సోనీ, విజయలక్ష్మి, సువర్ణ, లక్ష్మమ్మ, లలిత తదితరులు.పాల్గొన్నారు..

# సిపిఐ పార్టీ నిర్మాణానికి బొమ్మగాని ధర్మబిక్షం సేవలు వెలకట్టలేనివి

## సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి డిసెంబర్ 31 : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ ) 100 వసంతాల సందర్భంగా నల్లగొండలో జరిగే బహిరంగ సభకు బయలుదేరే ముందు చౌటుప్పల్ పట్టణం కేంద్రం లోని బొమ్మగాని ధర్మ బిక్షం విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో అనేక వీరోచిత పోరాటాలు సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నైజాం నిరంకుశ పాలనకు చరమ గీతం పాడడంలో ధర్మబిక్షం అనేక త్యాగాలు చేసారని అన్నారు. నల్లగొండ జిల్లాలో పేద ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ వారికి ఇంటి జాగాలు,సాగు భూములు పంపిణీ చేశారని, మూడుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు ఎంపీగా చట్టసభల్లో ప్రజల సమస్యలపై గలమెత్తుతూ, ప్రజలకు అవసరమైన విషయాల్లో ప్రభుత్వాలకు అర్థవంతంగా సూచనలు చేసేవారని అన్నారు. సిపిఐ పార్టీ నిర్మాణంలో గ్రామ గ్రామాన పార్టీ శాఖలని ఏర్పాటు చేసి పోరాటాలు నిర్వహించారని అన్నారు, గీత పనివారల సంగం ఏర్పాటు చేసి వారి హక్కులకై దేశ వ్యాపితంగ విశ్రుత ఉద్యమాలు నిర్వహించడం జరిగిందని, ధర్మబిక్షం స్ఫూర్తితో సిపిఐ పార్టీ ని మరింత ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కేవిఎల్, గీతా పనివారల సంఘం రాష్ట్ర సమన్వయ కార్యదర్శి బొమ్మగాని నాగభూషణం, సిపిఐ మండల కార్యదర్శి పల్లె శేఖర్ రెడ్డి, పగిల్లమోహన్ రెడ్డి, ఉడుత రామలింగం, కొండూరు



వెంకటేష్, రొండి నరసింహ, బద్దుల సుధాకర్, టంగుటూరి రాములు, నీళ్ల బిక్షపతి, బోయ మంకులు, ఎస్ఏ రహమాన్, కాకి పాండు, గంగనబోయిన నరసింహ, మహేశ్వరం యాదయ్య, పాస్. అశోక , ఉడత రాజు, రేగోటి బిక్షపతి,తదితరులు పాల్గొన్నారు.

# బీసీల ఉన్నతికి కృషి చేసింది: టిడిపి పల్లా శ్రీనివాసరావు రాష్ట్ర టిడిపి అధ్యక్షులు

విశాఖపట్నం వార్త మిర్రర్ టీడీపీ బిసిల పార్టీ... బిసి లకు ఉన్నతి పాటు పడిన పార్టీ తెలుగుదేశం పార్టీ మాత్రమే అని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు అన్నారు మంగళవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక బిసిగా నన్ను రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించడం జరిగిందని చెప్పారు రాష్ట్ర పోలీస్ డిజిపి గా ద్వారకా తిరుమల రావు బిసి ఉన్నారు రాష్ట్ర ముఖ్య కార్యదర్శి గా విజయానంద ఒక బిసి ఉన్నారు. కేంద్ర మంత్రి రామోహనాయుడు ఒక బిసి ఉన్నారు. ఇక కాబినెట్ లో ఏభై శాతం బిసి లు మంత్రులు గా ఉన్నారు. టిక్కెట్లు ఇచ్చిన విషయంలో శాసన సభ్యులు ఐన వారిలో అరవై శాతం పైగా బిసి లకు ఇచ్చిన పార్టీ తెలుగుదేశం. జిల్లా ఇంచార్జి లు కూడా బిసి లకు పట్టం కట్టిన పార్టీ టిడిపి , కూటమి పార్టీలు ఇక వైసీపీ ఐదేళ్లలో నాలుగు రీజినల్ కోర్డినేటర్ లు వారి సామాజిక వర్గం వారినే పెట్టారు మంత్రులు, చివరికి డిజిపి , సి ఎస్ , ఐఏఎస్ లు కూడా రెడ్డి అనే పదం వినిపించింది కనిపించింది పాలించింది. అటువంటి వైసిపి నేతల అవ్వాక్కులు, చెవాకులు పలికేది.. చివరికి ఈ రోజు కూడా వైసిపి రీజినల్ కోర్డినేటర్స్ విజయసాయి పెద్దిరెడ్డి సుబ్బారెడ్డి సజ్జల రెడ్డి ల మీదే పార్టీ నడిపిస్తున్నారు. వైసిపి పాలనలో బిసి నాయకులను అనగతొక్కే ప్రయత్నం చేశారు. బీసీ నాయకులకు నమ్మకం ఇవ్వలేదు. అధిక శాతం బిసి ల అసైన్ భూములు కొట్టేశారు. కూటమి ప్రభుత్వం బీసీ లకు రక్షణ చటం ప్రవేశ పెట్టారు. అమర్నాథ్ గౌడ్ ను చంపారు. బీసీ నాయకులను హింసలు పెట్టారు. కూటమి ప్రభుత్వం తోనే న్యాయం జరుగుతుంది.. దోపిడి చేసిన సిఎంగా జగన్ పేరు చెప్పుకుంటున్నారుఅడ్డగోలుగా సంపాదించిన వ్యక్తి గా జగన్ పేరు చెప్పుకుంటున్నారు

**మంత్రి పదవి కంటే రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు గొప్ప పదవి.**

కొండపల్లి శ్రీనివాస విషయంలో తప్పుడు ప్రచారాలను స్వయంగా మంత్రి ఖండించారు, అసమర్థత, అవినీతి,ఆరోపణలు మీద తప్ప మంత్రులు మార్పు ఆలోచన ఉండదు ,కానీ ఇప్పుడు ఏ మంత్రి పదవులు మార్పు ఉండదు,స్థానిక సంస్థలో నాలుగేళ్లు వరకు పదవి కాలం ఉంటుంది కనుక ..ఆ సమయం పూర్తి ఐన తరవాత ఆలోచన చేస్తాంలిమేం ఉచిత బస్ ప్రయాణం హామీ త్వరలో నిలబెట్టుకుంటాం లికొత్త సంవత్సరం లో విశాఖలో ఆర్థిక ప్రగతి సాధించే రీతిలో



నడుపుతాం చాలా మంది కూటమి లో చెరడానికి వస్తున్నారు..మామూడు పార్టీ లు మాట్లాడుకుని నిర్ణయాలు తీసుకుంటాంలి. రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండి బాబ్జి మాట్లాడుతూ దేశ రాజకీయ చరిత్రలోనే ఒక సువర్ణ అక్షరాలతో లిఖించేలా భారీ మెజారిటీలతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీలు మన విశాఖ జిల్లా నుంచి నమోదు కావడం ఒక గొప్ప విషయం.రాష్ట్రంలో అత్యధిక మెజారిటీ గాజువాక, భీమిలి.. పెందుర్తి నియోజకవర్గాలు విశాఖ జిల్లాలోనే ఉండడం.. ప్రజలు కూటమి ప్రభుత్వానికి ఏ స్థాయిలో మద్దతు పలికారు చాటి చెప్పే విషయం. ప్రజలు నమ్మకం పెట్టుకున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే 4000 రూపాయలు పెన్షన్ చేశారు. ఒకటో తారీకు సెలవు అయితే.. 31 వ తారీకు పెన్షన్ ఇస్తున్నారు. ఇక రాజకీయంగా బీసీ లుకు సముచితఇచ్చింది టిడిపి . సీట్లు పదవులు విషయంలో టిడిపి నే బీసీ లకు వెన్ను దన్నుగా నిలిచిందన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోలమర శెట్టి శ్రీనివాసరావు లీగల్ సెల్ నాయకులు పతివాడ గిరిధర్ టిడిపి నాయకులు రాజమండ్రి నారాయణ పొడుగు కుమార్ ఆరేటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి డిసెంబర్ 31 : చౌటుప్పల్ మున్సిపాలిటీ ప్రజలకు, మరియు మండలం ఉన్న ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు ఈ సందర్భంగా ఆరుట్ల లింగస్వామి మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆరోగ్యంతో, శాంతితో జీవించాలని ఆకాంక్షించారు. అందరికీ ఆరోగ్యం, ఆనందం, శ్రేయస్సుతో కూడిన కొత్త సంవత్సరం రావాలని వారు మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఆంగ్ల నూతన సంవత్సరం శుభాకాంక్షలు



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి డిసెంబర్ 31 : చౌటుప్పల్ మండలంలోని నేలపట్ల గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త దబ్బటి శేఖర్ విలేకరులతో మాట్లాడుతూ 2024 వీడ్కోలు చెబుతూ 2025 స్వాగతం పలుకుతున్న సందర్భంగా అధికారులకు పాత్రికేయులకు పోలీస్ లకు వృద్ధులకు మహిళలకు యువకులకు తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ ఆంగ్ల నూతన సంవత్సరం శుభాకాంక్షలు ప్రతి ఒక్కరికి పత్రిక ముఖంగా తెలియజేస్తున్నాను.




## తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర మహిళా కార్యదర్శిగా శివ పార్వతి

**:::మహిళా చేనేత కార్మికుల సమస్యల పట్ల కృషి చేస్తా**

దేవరకొండ డిసెంబర్ 31 వార్త మిర్రర్ : తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర మహిళా కార్యదర్శిగా ప్రమాణ స్వీకారం చేసినట్లు శిరందాసు శివ పార్వతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా కార్యదర్శి శివపార్వతి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇంతటి బాధ్యతను అప్పగించిన తెలంగాణ చేనేత ఐక్యవేదిక వారికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి మహిళా చేనేత కార్మికుల సమస్యల పట్ల చేనేత కార్మికుల అభివృద్ధి కొరకు ప్రభుత్వానికి చేనేత పరిశ్రమకు మధ్యన వారధిగా ఉంటూ ఎల్లప్పుడూ చేనేత కార్మికుల అభివృద్ధి కొరకు నా వంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు.రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ గ్రామాన పద్మశాలి జాతి మహిళ చేనేత కార్మికుల సంక్షేమం కోసం కృషి చేసి ప్రభుత్వం నుండి రావాల్సిన పథకాలను క్షేత్రస్థాయిలో అమలు జరిగే విధంగా తనవంతు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.పద్మశాలి సేవా సంఘం మహీళా సంఘం కుల బాంధవులకు రుణపడి ఉంటానన్నారు.



## పారిశ్రామిక వాడలో పెన్షన్ పంపిణీ

పశ్చిమ నియోజకవర్గం లో 60వ వార్డు మరియు 58వ వార్డు శ్రీహరిపురం లో పింఛన్లు పంపిణి కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ గణబాబు ఈ కార్యక్రమంలో జోనల్ కమీషనర్ మరియు కూటమి నాయకులు, పారిశ్రామి వాడ ప్రచార ప్రతినిధి జోగి, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పేద ప్రజల పెన్నిధి సామాజిక ప్రజా సేవకుడు జాలే నరసింహారెడ్డి

**జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఆల్ ఇండియా సమతా సైనిక్‌దళ్**

చందంపేట డిసెంబర్ 31 వార్త మిర్రర్ : పీసీసీ సభ్యులు పిఏసిఎస్ చైర్మన్ జాలే నరసింహారెడ్డి పుట్టినరోజు సందర్భంగా చందంపేట మండలం పోలేపల్లి ఎక్స్ రోడ్డు లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా పలువురు యువత రక్తదానం చేయడం జరిగింది. అనంతరం ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దళితరత్న డాక్టర్ బుర్రి వెంకన్న ఆధ్వర్యంలో జాలే నరసింహారెడ్డి కి సభ్యులతో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పేద ప్రజల పెన్నిధి సామాజిక ప్రజాసేవకుడు, సామాజిక ప్రజా ఉద్యమ సారధి, ప్రజా ఆదరణతో ఉన్నత శిఖరాలకు ఎదిగి ప్రజాసేవకై ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో జాలే నరసింహారెడ్డి ఉండాలని కోరుతూ ఎంతోమంది పేద ప్రజలకు ఆర్థిక సహాయం అందజేస్తూ నియోజకవర్గం లోని పేద పక్షపాతిగా ప్రజలఆత్మీయుడుగా ప్రజలను బడుగు బలహీన వర్గాలను ఆదుకుంటున్నటువంటి ప్రజా నాయకుడు జాలే నరసింహారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ పుష్పగుచ్చాన్ని అందించి శాలువా తో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు అభినందనలు తెలియజేశారు. వారితోపాటు జిల్లా కన్వీనర్ దళితరత్న మద్దిమడుగు బిక్షపతి ఆనంద్.జిల్లా రాములు.బుడిగ వెంకటయ్య మేదరి ప్రసాద్. ఖండే ల వెంకన్న.భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.





# ఘనంగా సమాచార హక్కు రక్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు జన్మదిన వేడుకలు

అచ్చంపేట డిసెంబర్ 31 వార్త మిర్రర్ : సమాచార హక్కు చట్టం రక్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ముంతోజీ లక్ష్మయ్య జన్మదిన వేడుకలు అచ్చంపేట పట్టణంలోని బాలసదనంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బాలసదనంలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు ముంతోజి లక్ష్మయ్య మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం రక్షణ సమితి ఆధ్వర్యంలో మరిన్ని సామాజిక స్పృహ కలిగిన కార్యక్రమాలను నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు రాష్ట్ర అధ్యక్షులు కొర్ర కిషన్ నాయక్, ప్రధాన కార్యదర్శి అజీమ్ కార్యదర్శి పగిడిమర్రి యాదగిరి కోశాధికారి ఆనంద్ కార్యవర్గ సభ్యులు ప్రకాష్ ఖాజా మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు...

# వెదజల్లే పద్ధతిలో వరిసాగు లాభదాయకం

## మొగ్గుచూపుతున్న రైతులు

## కూలీల కొరతను అధిగమించొచ్చు

## వెదజల్లే పద్ధతి వైపు మొగ్గుచూపుతున్న రైతులు

## జగిత్యాల జిల్లాలో ఎక్కువగా సాగు



తిరుమల శంకర్ వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 31 : వెదజల్లే పద్ధతిలో వరి సాగు సత్ఫలితాలిస్తున్నది. అదును సమయంలో కూలీలు దొరక్క ఇబ్బంది పడే సందర్భాల్లో ప్రత్యామ్నాయం వైపు చూస్తూ వెదజల్లే పద్ధతిపై రైతులు దృష్టిసారిస్తున్నారు. ఫలితంగా కూలీల ఖర్చు మిగలడమే కాకుండా పంట కూడా ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. నాట్లు వేయడం ప్రస్తుతం పాత తరానికే పరిమితమైంది. నేటి మహిళలు నాట్లు వేసే పద్ధతిపై ఆసక్తి చూపడం లేదు. దీంతో రైతులకు కూలీల కొరత ఇబ్బందికరంగా మారింది. అదేవిధంగా సకాలంలో నాట్లు వేయకపోవడంతో దిగుబడిపై ప్రభావం చూపనున్నది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్న క్రమంలో ప్రభుత్వం కూడా వెదజల్లే పద్ధతిపై రైతులకు విస్తృతంగా ప్రచారం కల్పించడంతో అన్నదాతలు ఆసక్తి చూపుతున్నారు.

**రాయికల్ మండలంలో ఇలా..**

రాయికల్ మండలంలో యాసంగిలో దాదాపు వందల ఎకరాల్లో వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. రాయికల్ మండలం లోని కిష్టంపేట, అల్లీపూర్, వీరాపూర్, కుమ్మరిపల్లి గ్రామాలలో రైతులు అధిక మొత్తంలో వెదజల్లే పద్ధతిపై దృష్టి సారించారు. వానకాలం కొంతమంది రైతులు వెదజల్లే పద్ధతిన మంచి ఫలితాలు రాబట్టడంతో యాసంగిలో దాదాపు వందల ఎకరాలకు పైగా అదే పద్ధతిలో వరి సాగు చేశారు.

**నాట్లకు పెట్టుబడి ఎక్కువ..**

సంప్రదాయ పద్ధతిలో నాటు వేస్తే ఎకరాకు కూలీల మొత్తం కలిపి రూ.6వేలు ఖర్చవుతుంది. డీజిల్, ఎరువుల ధరలు పెరగడంతో సాగు పూర్తయ్యే వరకు ఎకరాకు రూ.25వేల నుంచి రూ.35వేల పెట్టుబడి అవుతుంది. నాటు విధానం ద్వారా విత్తనం ఖర్చు కూడా ఎక్కువవుతుండగా.. వెదజల్లే పద్ధతిలో ఎకరాకు 8–10 కేజీల విత్తనాలు సరిపోతాయి. నారును పెంచి మళ్లీ నాటడం వల్ల వేర్లు తెగిపోవడంతో పిలకలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉండదు. వెదజల్లే పద్ధతిలో నేరుగా పెంచడం వల్ల దిగుబడి అధికమవుతుంది. ఈ పద్ధతిని అవలంబిస్తే పంట ఆరంభంలో మందులతో కలుపును నివారించవచ్చు. అదేవిధంగా సాధారణ సాగుకంటే 10–15 రోజుల ముందుగానే పంట కోతకు వస్తుంది. ఈ పద్ధతిపై ప్రభుత్వం కూడా విస్తృతస్థాయిలో అవగాహన కల్పించి రైతులను ప్రోత్సహిస్తున్నది. ఏఈవోల ద్వారా రైతువేదికల్లో సమావేశాలు నిర్వహించి వెదజల్లే, డ్రమ్ సీడర్ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు. పాత కాలం వరి సాగు కంటే వెదజల్లే పద్ధతి సులువుగా ఉండడమే గాక అధిక ఆదాయం వస్తుండడంతో రైతులు అటువైపే మొగ్గుచూపుతున్నారు. సాధారణ వ్యవసాయం కంటే రూ.8వేల నుంచి రూ.10వేల వరకు పెట్టుబడి రూపంలో మిగులుతున్నది.

**వెదజల్లే పద్ధతి బాగుంది**

యాసంగిలో నాలుగెకరాల్లో వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేశాను. సాధారణ నాట్ల కంటే ఈ పద్ధతి చాలా సులువుగా ఉంది. సాధారణ పద్ధతికంటే వెదజల్లే పద్ధతిలో సాగు చేసిన చెలకలే బాగున్నాయి. నాకు ప్రస్తుతం ఎకరాకు రూ.8వేల నుంచి రూ.10వేల ఖర్చు తగ్గింది. వరి చేను కూడా ఆశించిన స్థాయిలో ఉంది. వెదజల్లే పద్ధతిలో పెట్టుబడి తగ్గి ఆదాయం పెరుగుతుందని ఆశిస్తున్నాము.

**చింతలపెల్లి రాజేశ్వర్ రెడ్డి, లికచ్చకాయల రాజేష్, రైతులు, కిష్టంపేట**

**డ్రమ్ సీడర్ పద్ధతి కూడా..**

వెదజల్లే పద్ధతి, డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి సాగు చేసుకుంటే పెట్టుబడి తగ్గడంతోపాటు దిగుబడి అధికంగా వస్తుంది. ఈ విధానంతో ఆశించిన స్థాయిలో రైతులు ఆదాయం పొందవచ్చు. ఖర్చులు తగ్గించుకోవాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం కొంతమంది రైతుల్లో మార్పును గమనించాం అని రాయికల్ మండల వ్యవసాయాధికారులు అంటున్నారు.

**తిరుమల శంకర్ రాయికల్ ప్రతినిధి**







## మిర్యాలగూడలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా స్వీట్ బేకరీ షాపులు

మిర్యాలగూడ డిసెంబర్ 31:–(వార్తమిర్రర్) : నూతన సంవత్సర వేడుకలలో భాగంగా మిర్యాలగూడ పట్టణంలోని స్వీట్స్, బేకరీ షాపులు కిటకిటలాడాయి. జనం న్యూ ఇయర్ కేకులు, స్వీట్స్ కొనేందుకు స్వీట్స్ బేకరి షాపుల్లలో భారీగా వచ్చారు. కస్టమర్లను ఆకర్షించేందుకు విద్యుద్దీపాలతో అలంకరించారు. దుకాణాల ముందు కౌంటర్లు ఏర్పాటు చేశారు. బేకరి షాపులు పోటీపడి కేకుల ధరలు తగ్గించారు. ఒక షాపులో కిలో కేక్ రూ.400లకు , అరకిలో రూ.200లకు విక్రయిస్తుండగా, మరో షాపులో కిలో కేక్ రూ.300లకు, అరకిలో రూ.150 లకు విక్రయించారు. అయితే ఎక్కువ జనం కూల్ కేక్ కొనుగోలు పట్ల ఆసక్తి కనబరిచారు. మాములు కేక్ ధర కంటే కూల్ కేక్ ధర రెండింతలు ఎక్కువగా ఉన్న ఎగ బడి కొన్నారు.




## గ్రేట్ హైదరాబాద్ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

### నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి దంపతులు

సికింద్రాబాద్, వార్త మిర్రర్ డిసెం బర్ 31... గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, టిటియుసి రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డి గ్రేటర్ హైదరాబాద్ నగర ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆరోగ్యంతో, శాంతితో జీవించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలు మరింత మెరుగ్గా అందించడానికి ప్రజల సహకారం అవసరమని, నగరాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.అందరికీ ఆరోగ్యం, ఆనందం, శ్రేయస్సుతో కూడిన కొత్త సంవత్సరం రావాలని వారు మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

## సంస్థాన్ నారాయణపురం మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

### నారాయణపూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : సంస్థన్ నారాయణపురం మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఉప్పల లింగస్వామి, ఈ 2025 వ సంవత్సరం ప్రజల జీవితంలో స్నేహం ,ప్రేమ వెలుగులతో ప్రత్యేకమైన సంవత్సరంగా మారాలని కోరుకుంటూ కాంగ్రెస్ ప్రజా పాలనలో మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సారథ్యంలో వ్యవసాయం, వ్యాపారంలో లాభాల్లో నడుస్తూ విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అందరికీ అందుతాయని, గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తాయని ధీమా వ్యక్తం చేశారు, మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు ఉప్పల లింగస్వామి

## రోడ్డుపై మెట్లు, మాన్యువల్స్ హెూల్స్ నిర్మిస్తున్న తొలగించే నాధుడే లేదు





మిర్యాలగూడ డిసెంబర్ 31:- (వార్త మిర్రర్) : కోట్ల రూపాయల వ్యయంతో ఒక వైపు రోడ్ల విస్తరణ పనులు సాగుతుండగా, మరో వైపు ఉన్న రోడ్డుపై మెట్లు, మ్యాన్ హెూల్స్ నిర్మిస్తున్న తొలగించే నాథులు కనపడటం లేదు. పాఠశాలలు, కళాశాలలు, వైద్యశాలలు, భారీ ట్రాఫిక్ ఉన్న చర్చి రోడ్డుపై మెట్లు, మ్యాన్ హెూల్స్ నిర్మించి 33 అడుగులే ఉన్న రొడ్డును మరింత ఇరుకు చేశారూ. రెండడుగులు ముందుకు వచ్చి నిర్మించారని వార్త దినపత్రికల్లో ప్రచురించగా టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి తొలగించారు. మళ్లీ నిర్మాణం చేశారని లాడ్జి యజమాని చర్యపై ప్రజలు ఆశ్చర్య పోతున్నారు. తొలగించిన మళ్లీ మళ్లీ నిర్మించడమేమిటి అని అంటున్నారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందుకు నీటి పారుదల ఈఈ లక్ష్మణ్ బాబు సస్పెండ్




మిర్యాలగూడ డిసెంబర్ 31:-( వార్త మిర్రర్) నీటిపారుదల శాఖ నల్గొండ జిల్లా మిర్యాలగూడ ఈఈ లక్ష్మణ్ బాబు ను సస్పెండ్ చేస్తు రాష్ట్ర భారి నీట పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి హైదరాబాదులోని జల సౌధాలో మంగళవారం జరిగిన నీటిపారుదల శాఖ సమీక్ష సమావేశంలో ఆదేశించారు. ఈఈ లక్ష్మణ్ బాబుపై ఫిర్యాదు చేసిన మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ నీటి పారుదల శాఖ సిఈ అజయ్ లు ఎత్తిపోతల పథకాల పనులలో అలసత్వం, స్థానికంగా అందుబాటులో ఉండకుండా నీటిపారుదల వ్యవహారంపై లక్ష్మణ్ బాబు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఇటీవల ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న విషయం మంత్రి దృష్టికి తీసుకుపోవటంతో వెంటనే స్పందించి సస్పెండ్ చేశారు.




## రాయికల్ పురపాలక సంఘం, కౌన్సిల్ సాధారణ సమావేశము

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 31 : జగిత్యాల జిల్లా రాయికల్ పురపాలక సంఘము కౌన్సిల్ సాధారణ సమావేశము చైర్మన్ శ్రీ మోర హన్మాండ్లు అధ్యక్షతన తేది: 31.12.2024న జరిగింది. ఇట్టి సమావేశములో పట్టణములో టియుఎఫ్ఐడిసి నిధులతో నిర్మాణములో ఉన్న సి.సి.డ్రెయిన్లు, రోడ్ల పనుల గురించి, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాలు, నీటి సరఫరా విషయాలను గురించి సమీక్షించారు. ఇట్టి సమావేశంలో (12) అంశాలను ఏకగ్రీవంగా తీర్మానించినారు. ఇట్టి సమావేశములో మున్సిపల్ కమీషనర్ ఎ. జగదీశ్వర్ గౌడ్, 1వ వార్డు కౌన్సిలర్, వైస్ చైర్పర్సన్ శ్రీమతి గంధ్ర రమాదేవి, 2వ వార్డు కౌన్సిలర్ శ్రీ కన్నాక మహేంధర్, 4వ వార్డు కౌన్సిలర్ శ్రీ తురగ శ్రీధర్ రెడ్డి, 5వ వార్డు కౌన్సిలర్ శ్రీ వల్లకొండ మహేష్, 6వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి అన్వరీ బేగం, 8వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి కల్లెడ సునీత, 9వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి శ్రీరాముల సువర్ణ, 10వ వార్డు కౌన్సిలర్ శ్రీ మ్యాకల కాంతారావు, 11వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి మ్యాకల అనురాధ, కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ మెరాజొద్దీన్, శ్రీమతి పెండెల వనిత, శ్రీ పిప్పోజి మహేంధర్ బాబు, మేనేజర్ బి. వెంకటి, మరియు మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## అభయాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి ర్యాల రాజేందర్ యాదవ్ నగదు విరాళం

సికింద్రాబాద్, వార్తా మిర్రర్ డిసెంబర్ 31.. జెన్ ప్యాక్ సమీపంలో ఉన్న అభయాంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధి కోసం సికింద్రాబాద్ తార్నాకకు చెందిన సీనియర్ నాయకులు ర్యాల రాజేందర్ యాదవ్ ర్యాల అడవయ్య ట్రస్ట్ ఆద్వర్యంలో రూ.20వేల విరాళాలన్ని అందజేశారు. ఆలయ కమిటీ వారికి రాజేందర్ యాదవ్ నగదును అందజేశారు. ఎంతో మహిమకల్గిన ఈ ఆలయ అభివృద్ధి కోసం అవసరమైతే ఇంకా విరాళం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని రాజేందర్ యాదవ్ పేరో న్నారు.

## సమాజాన్ని డ్రగ్స మహమ్మారి పట్టిపీడిస్తోంది వీటి పట్ల యువత, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

### రంగారెడ్డి జిల్లా ప్రైవేటు డిగ్రీ కళాశాలల కమిటీ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : సమాజంలో డ్రగ్స్ మహమ్మారి పట్టిపీడిస్తుందని, వీటి పట్ల యువత, విద్యార్థులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని అన్నారు, ఈ 2025 వ నూతన సంవత్సర సందర్భంగా యువత, విద్యార్థులు యాక్షన్ ప్లాన్ ప్రకారం చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఎటువంటి మానసిక ఒత్తిడి లకు గురికాకుండా చదువుపై దృష్టి పెట్టాలని తెలిపారు, మీ మిత్రులు మీలో ఒకరు ఎవరైనా డ్రగ్స్ కు అలవాటు పడితే టోల్ ఫ్రీ 14416 నెంబర్ కు కాల్ చేయాలని కోరారు, డ్రగ్స్ పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి నూతన సంవత్సరంలో యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోండి మీ భవిష్యత్తులో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు అని అన్నారు రాపర్తి సురేష్ గౌడ్

## తెలంగాణ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు: బద్దం ధనుంజయ్ గౌడ్



నాగోల్ వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : తెలంగాణ ప్రజలకు 2025 వ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బద్దం ధనుంజయ్ గౌడ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ 2025 వ కొత్త సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆరోగ్యంతో, స్నేహితులతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. అందరికీ విద్య, ఉపాధి, ఉద్యోగాల్లో రాణించాలని, ప్రజలు ఆరోగ్యం, ఆనందం, శ్రేయస్సుతో కూడిన కొత్త సంవత్సరం కలిసి రావాలని వీటిపై ప్రతి ఒక్కరు కృషి చేయాలని వారు మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బద్దం ధనుంజయ్ గౌడ్



## ఘనంగా జన్మదిన వేడుకలు

సంస్థాన్ నారాయణపురం,డిసెంబర్ 31:( వార్త మిర్రర్) : సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రం శ్రీ కంఠమహేశ్వర దేవస్థానం అధ్యక్షులు రాపర్తి కరుణాకర్ గౌడ్ కుమార్తె రాపర్తి అక్షర జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో అయ్యప్పలు గురుస్వామి ఐలయ్య, దూసర వెంకటేష్ గౌడ్, ఉప్పల శ్రీను, రాసల యాదయ్య ,బుగ్గ రాములు, డాక్టర్ కిరణ్ ,తదితరులు పాల్గొన్నారు

# ప్రజా సమస్యలపై సత్వర న్యాయం జరుగుతుందనీ భరోసా కల్పించాలి

## చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన శిక్ష .. రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్



మందమర్రి డిసెంబర్ 31: వార్త మిర్రర్ ప్రతినిధి పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదు దారులతో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని, ప్రజలు తమ సమస్యలతో పోలీస్ స్టేషన్ కు వస్తే వెంటనే స్పందించి బాధితులకు సత్వర న్యాయం జరిగుతుందని భరోసా కల్పించాలని రామగుండం పోలీసు కమిషనర్ ఎం శ్రీనివాస్ సూచించారు. వార్షిక తనిఖీలలో బాగంగా మంగళ వారం పట్టణంలోని సీఐ కార్యాలయాన్ని,పోలీసు స్టేషన్ ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ కు చేరుకున్న పోలీస్ కమిషనర్ కి పోలీస్ అధికారులు మొక్కలను అందించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిపి సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీస్ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం పోలీస్ స్టేషన్ రిసెప్షన్ సిబ్బంది పనితీరును పరిశీలించారు. స్టేషన్ కు వచ్చే ప్రతి దరఖాస్తు పై తప్పనిసరిగా పిటిషన్ మేనేజ్మెంట్ లో అప్లోడ్ చేసి రిసిప్ట్ ఇవ్వాలని వచ్చిన ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు చేపట్టారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ లోని లాక్ అప్ రూమ్, రైటర్ రూమ్, రికార్డ్స్ రూమ్ పరిశీలించారు. అనంతరం సర్కిల్, పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పెండింగ్ కేసులు, నిందితుల అరెస్ట్, కోర్ట్ లో పెండింగ్ లో వున్న కేసులు, వాటికి సంబందించిన దర్యాప్తు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిదంగా స్టేషన్ లో నిర్వహిస్తున్న పలురకాల రికార్డులను పోలీస్ కమిషనర్ పరిశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల నియంత్రణకై పోలీస్ స్టేషన్ పరిధిలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని, ప్రజల భద్రత మనందరి బాధ్యతని, ప్రధానంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లపై, ట్రబుల్ మాంగర్స్ పై ప్రత్యేక నిఘా పెట్టాలని, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపట్ల కఠినంగా వ్యవహారించాలన్నారు. అదే సందర్భంలో స్టేషన్ కు వచ్చే ఫిర్యాదు దారులతో మర్యాద గా నడుచుకోవాలన్నారు. ప్రజలు పోలీస్ స్టేషన్ కు వచ్చి ఏలాంటి సమస్య, సందేహాలు, సలహాలు, సూచనలు అడిగే లాగా ప్రజలకు వున్న నమ్మకానికి తగ్గట్టుగా విధులు నిర్వర్తించి ప్రజల నమ్మకాన్ని పొందాలన్నారు. మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్, సీఐ శశి ధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ తోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందించి ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల పేద ప్రజలకు నమ్మకం పెంచాలి

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి







మిర్యాలగూడ డిసెంబర్ 31:-( వార్త మిర్రర్) : ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా పేద ప్రజలకు ఇంకా మెరుగైన సేవలు అందించి ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల నమ్మకాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రభుత్వ వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె నల్గొండ జిల్లా మిర్యాలగూడ సమీపంలోని ఆలగడప ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని, మిర్యాలగూడ పట్టణం ప్రకాష్ నగర్ లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిర్యాలగూడ మండలం ఆలగడప ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి వస్తున్న ఔట్ పేషెంట్లు, పిహెచ్సిలో గత ఆరు నెలల్లో నిర్వహించిన ప్రసవాలు ,ఇన్ పేషెంట్లు, మాత, శిశు మరణాల సంఖ్య తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆలగడప పిహెచ్సిలో ప్రసవాల సంఖ్య తక్కువగా ఉండడం, ఈ ప్రాంతంలో అనేకమంది ప్రజలు వీధి కుక్కల బారిన పడటం వంటి వాటిపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్కే.మోయిజ్, డిప్యూటీ డిఎంహెచ్వో గీతా వాణిలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు వీధి కుక్కల బారిన పడకుండా ఏం చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. ప్రసవాల రిజిస్టర్ ను ఆమె పరిశీలిస్తూ తక్కువ ప్రసవాలు కావడంపై ప్రశ్నించారు. బాగా అభివృద్ధి చెందిన మిర్యాలగూడ లాంటి ప్రాంతంలో మాత ,శిశు మరణాల సంఖ్య ఎక్కువగా ఉండడం, అదేవిధంగా ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులు, ఆర్ఎంపీల వద్దకు వెళ్లడం బాధాకరమని అన్నారు. డిసెంబర్ నెలకు సంబంధించిన ప్రసవాల తేదీల రిజిస్టర్ ను పరిశీలించారు. ప్రసవాల శాతం తక్కువగా ఉండడం ఆమె గమనించారు. ప్రభుత్వ ఆస్పత్రి ద్వారా మంచి సేవలు అందిస్తే ప్రజలు ప్రైవేట్ హాస్పటల్లకు ఎందుకు వెళతారని ప్రశ్నించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మిర్యాలగూడ పట్టణంలోని ప్రకాష్ నగర్ లో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన రహదారిలో ఇరుకైన గదుల్లో నిర్వహించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రభుత్వం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసినప్పటికీ ఇంకా ఎందుకు నిర్మాణాన్ని చేపట్టలేదని ఈఈని, కాంట్రాక్టర్ ను ప్రశ్నించారు. తక్షణమే యుపిహెచ్సి భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా ఎన్ఎస్పి పిహెచ్సి నిర్మాణాలను తక్షణమే చేపట్టవలసిందిగా ఆదేశించారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్య, ఔట్ పేషెంట్లు, సర్జరీలు, ఇన్ పేషెంట్లు తదితర అన్ని వివరాలను యుపిహెచ్సి డాక్టర్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ధరణి పెండింగ్ కేసులపై ఆమె సబ్ కలెక్టర్ ఎంనారాయణ్ అమిత్, తహసిల్దారు ఎన్.హరిబాబుతో సమీక్షించారు. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలని సూచించారు. అవంతిపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మిర్యాలగూడ, ఆలగడప ప్రాథమిక సహకార సంఘాల ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రంలో దాన్యం తడిసినందున తీసుకోవడం లేదని కొంతమంది రైతులు జిల్లా కలెక్టర్ దృష్టి తీసుకురాగా, వెంటనే జిల్లా వ్యవసాయ, పౌరసరఫరాల శాఖ అధికారులతో మాట్లాడి సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని అవంతిపురం పంపించి వివరాలు తెలుసుకుని ధాన్యం నాణ్యత ప్రమాణాల ఆధారంగా వెంటనే కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ లేబర్ రూమ్, జనరల్ వార్డ్ లను తనిఖీ చేసి ఆసుపత్రిలో నిర్వహిస్తున్న ప్రలు, తదితర అంశాలపై ఆసుపత్రి సూపరింటిండెంట్ శ్రీనివాస్ సమరథ్ తో మాట్లాడుతూ మాత శిశు మరణాలు సంభవించకుండా పౌష్టికాహారం తీసుకోవడం, పరీక్షలను సకాలంలో చేయించుకోవడం పై గర్భిణీలు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రైవేట్ ఆస్పత్రి నుండి రోగం ముదిరిన తర్వాత చివరిక్షణంలో ప్రభుత్వాసుపత్రులకు వస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి రోగులను ప్రైవేట్ ఆసుపత్రులు పంపకుండా చూడాలని, వాటిని నియంత్రించాలని ఆదేశించారు. ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రి వైపు వెళ్లకుండా మంచి వైద్య సేవలను అందించి ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల నమ్మకాన్ని పెంపొందించాలని పునరుద్ఘాటించారు. మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రిలో 100 ప్రసవాలు అవుతున్నాయని తెలుసుకొని ఆసుపత్రిలో 400 వరకు ప్రసవాలు నిర్వహించే అవకాశం ఉందని, అందువలన ప్రసవాల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని ఆమె ఆసుపత్రి సూపరింటీండెంట్ ను, డిప్యూటీ డిఎంహెచ్ఓ లను ఆదేశించారు. ఇందుకోసం అవసరమైతే ఏరియా ఆసుపత్రిలో మరిన్ని సౌకర్యాలను కల్పిస్తామన్నారు. ఇటీవల రాష్ట్రప్రభుత్వం ఏరియా ఆసుపత్రికి ఆధునాతన 108 అంబులెన్స్ వాహనాలను ఏర్పాటు చేయడం జరిగిందని అయితే వాటిని పేద రోగులకు మాత్రమే ఏర్పాటు చేయాలని, ఒకవేళ అలా కాకుండా ప్రైవేట్ కు పంపినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆస్పత్రిలో కాన్పుల వార్డులో రోగుల సహాయకులు పూర్తి పరిశుభ్రత పాటించడం, హ్యాండ్ వాష్ చేసుకున్న తర్వాతనే లోపలికి అనుమతించాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ జనరల్ వార్డు ను సందర్శించి డాక్టర్లందరూ అన్ని వార్డులలో తప్పనిసరిగా నూరు శాతం హాజరు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లేనట్లయితే అవసరమైతే బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తామని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. కలెక్టర్ వెంట మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం. నారాయణ్ అమిత్ అమిత్ మిర్యాలగూడ తహసిల్దార్ ఎన్.హరిబాబు, ఎంపీడీఓ శేషగిరిశర్మ, మున్సిపల్ కమిషనర్ ఎండీ.యూసుఫ్, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ఎస్.గీతావాణి, మున్సిపల్ డిఇఇ వెంకన్న, ఆలగడప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్కే మోయిజ్, ప్రకాష్ నగర్ అర్బన్ పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ తులసిరాం, వైద్యులు ఉన్నారు.

# విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

### బాధ్యతగా చదివితేనే ఉజ్వల భవిష్యత్తు-రాపర్తి సురేష్ గౌడ్





రామంతపూర్ వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం రామంతపూర్ లోని స్ఫూర్తి ఉమెన్స్ డిగ్రీ కళాశాల లో ఏర్పాటు చేసిన ఫెస్ట్ కి ముఖ్య అతిథిగా హాజరై పట్టాలను అందజేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి సమాజానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ రాపర్తి సురేష్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పసుల ప్రభాకర్ రెడ్డి, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సాయి జెన్ శేఖర్, ప్రశాంత్ గౌడ్, పవన్, సురం శంకర్, జహాగీర్ తదితరులు పాల్గొన్నారు.



# ఏరియాలో 82% బొగ్గు ఉత్పత్తి

### ::: ఏరియా జిఎం దేవేందర్

మందమర్రి డిసెంబర్ 31: వార్త మిర్రర్ ప్రతినిధి : ఏరియాలో డిసెంబర్ మోసానికి గాను నిర్దేశించిన లక్ష్యంలో 82% బొగ్గు ఉత్పత్తి సాధించడం జరిగిందని సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ జి దేవేందర్ తెలిపారు. జిఎం కార్యాలయంలోని తన చాంబర్ లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏరియా లోని భూగర్భ,ఉపరితల గనుల్లో డిసెంబర్ మాసానికి గాను నిర్దేశించిన 3 లక్షల టన్నులకు గాను 2.47 లక్షల టన్నులు బొగ్గు ఉత్పత్తి సాధించడం జరిగిందని వివరించారు. ఏరియా లోని ఆర్కే ఓసిపి,కేకే 5గనుల్లో డిసెంబర్ మాసానికి 100 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించడం జరిగిందని.ఆర్కే ఓసిపిలో వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించడం జరిగిందని ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు 3 నెలల ముందుగానే ఆర్కే ఓసిపిలో వార్షిక లక్ష్యం అధిగమించడం అభినందనీయం ఉద్యోగులను అభినం దించారు. ఏరియా లోని కాసిపేట, కాసిపేట2, శాంతిఖని గనుల్లో బొగ్గు ఉత్పత్తి పెంచే ందుకు చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు.అధికారులు ఉద్యోగులు సమిష్టిగా కృషి చేసి ఏరియాకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలని కోరారు. ఎస్ఓటు జి ఎం విజయ ప్రసాద్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, ఎస్ఈ ఐఈడి ఫణి కుమార్, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, సివిల్ ఎస్ఈ రాము, డీజీఎం ఎఫ్&ఎ ఆర్విఎస్ ఆర్ కే ప్రసాద్, డివైపిఎం ఎండి ఆసిఫ్ లు పాల్గొన్నారు.



# సంస్థాన్ నారాయణపూర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ సీజన్ -4

సంస్థాన్ నారాయణపూర్ డిసెంబర్ 31:( వార్త మిర్రర్) : నారాయణపూర్ మండల కేంద్రంలోని గత మూడు సంవత్సరాలుగా మండల కేంద్రంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించే సంస్థాన్ నారాయణపురం ప్రీమియర్ లీగ్ క్రికెట్ 8వ తేదిన ప్రారంభం కానుందని ప్రీమియర్ లీగ్ వ్యవస్థాపకూడు అధ్యక్షులు ఉప్పల నాగరాజు ఒకప్రకటనలో తెలిపారు. ఈ యొక్క టోర్నమెంట్ కు గత మూడు సంవత్సరాలుగా స్పాన్సర్స్ గా నిలుస్తున్నటువంటి నారాయణపురం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ముద్దంగుల నరసింహ, ఉప్పల లింగస్వామి టోర్నమెంట్ ఆర్గనైజర్లు కృతజ్ఞతలు తెలిపారు ఈ సంవత్సరం కూడా ముద్దంగుల నరసింహ, ఉప్పల లింగస్వామి స్పాన్సర్స్ గా కొనసాగుతున్నారని తెలిపారు మండలంలోని దాదాపు అన్ని గ్రామాల నుండి యువకులు మండల కేంద్రంలో నిర్వహించే ఈ క్రికెట్ పోటీలో పాల్గొని విజేతలుగా నిలవాలని తెలిపారు.సీజన్ 1 లో బిజేఆర్ టీమ్, సీజన్-2 మరియు సీజన్ 3 లో పుట్టపాక లయన్స్ విజేతలగా నిలిచారు. సీజన్-4 లీగ్ యొక్క షెడ్యూల్ ను 7వ తేది న డ్రా తియ్యడం జరుగుతుంది 08- 01- 2025 తేదీ ఉదయం 9:00 గంటలకు ఎస్ ఎన్ పి ఎల్ సీజన్ 4 ప్రారంభం అవుతుంది కావున తేది 01-01-2025 నుంచి మండలంలోని అన్ని క్రికెట్ టీమ్ ల ఎంట్రీలను తీసుకుంటామని తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజర్లు కొండ శ్రీకాంత్ గౌడ్,కొప్పు రామకృష్ణ,మిరియాల శ్రీహరి, కొండ నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు



# ఇల్లు నిర్మాణానికి రూ.10,000 తక్షణ ఆర్థిక సహాయం అందజేత

### ::: ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

కల్వకుర్తి డిసెంబర్ 31 వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి మండలం తర్నికల్ తండా కి చెందిన సీత్యా నాయక్ఇల్లు షాక్ సర్క్యూట్ కారణంగా పూర్తిగా దగ్ధమైపోయింది. కట్టు బట్టలతో సహా అన్ని పూర్తిగా అగ్నికి ఆహుతి అవ్వడం, ఈ విషయం తెలుసుకున్న టాస్క్ సి ఓ ఓ మరియు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయంగా రూ" 10,000 పదివేల రూపాయలను అందించడం జరిగింది. బాధితునితో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ ధైర్యంగా ఉండాలని మళ్లీ ఇల్లు కట్టుకోవడానికి తన వంతు సహాయాన్ని ఖచ్చితంగా చేస్తానని చెప్పి మనోధైర్యాన్ని కల్పించడం జరిగింది. ఈ నగదును యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి రాపోతు అనిల్ గౌడ్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బీసబాలరాజు,తండా యువజన కాంగ్రెస్ నాయకుడు రాజు నాయక్ లు బాధితునికి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజు,చంద్రు, వసురాం,గోపాల్,లక్పతి, వినోద్ ,రాజు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా కృష్ణ గౌడ్ జన్మదిన వేడుకలు

సంస్థాన్ నారాయణపూర్ డిసెంబర్ 31:( వార్త మిర్రర్) : నకిరేకల్ ముద్దుబిడ్డ కృష్ణగౌడ్ జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ కట్ చేపిచ్చిన చౌటుప్పల్ శ్రీ మణికంత కార్ బజార్ హ్యాండ్ మోటార్స్ మిత్రబృందం, సుర్వి సురేష్ గౌడ్, సుర్వి నరేష్ గౌడ్, జువ్వగాని శ్రీకాంత్, చిలువేరు గణేష్, గుండు నవీన్, గుండు అనిల్,ఘనంగా జన్మదినశుభాకాంక్షలు తెలిపారు

# నారాయణుడు ఆది మహావిష్ణువుగా కొలువు దీరిన తెలంగాణలో ఏకైక దేవాలయం!

## 2015లో వైకుంఠ ఏకాదశి నాడు వరకాంతం జంగారెడ్డి సారాధ్యంలో ప్రతిష్టాపన!

## కార్తీక మాసంలో లభించిన శ్రీ ఆది మహావిష్ణు విగ్రహానికి మాత్రం కొన్ని వందల సంవత్సరాల చరిత్ర!








యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : భాగ్య నగరానికి అతి సమీపంలో పచ్చని, ప్రకృతి మధ్య, కొండ కోనల మధ్య చెరువు సమీపంలో భక్తులను ఆకట్టుకునేలా కనిపిస్తుంది శ్రీ ఆది మహావిష్ణువు ఆలయం. యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ మండలం. దేవలమ్మ నాగారంలో చెరువు కట్ట పైన ఉన్న ఈ ఆలయాన్ని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయి అని భక్తుల నమ్మకం. శ్రీదేవి, భూదేవి సమేతంగా దర్శనమిచ్చే ఈ స్వామిని జగన్మోహిని గాను కొలుస్తారు, అందుకే స్వామి కాళ్లకు పట్టీలు, మెట్టెలు, కడియాలు అలంకరిస్తారు. విష్ణుమూర్తి దాల్చిన దశావతార రూపాలన్ని ఇక్కడున్న విగ్రహంలో కనిపిస్తాయి.

### స్థల పురాణం

ఈ ఆలయంలోని విగ్రహానికి వందల సంవత్సరాల చరిత్ర ఉన్నట్లుగా ఇక్కడున్న శిలాశాసనం ద్వారా అర్థం చేసుకోవచ్చని పురావస్తు శాఖ అధికారులు పేర్కొన్నారు. అయితే ఆ విగ్రహం ఎక్కడిది అనేది ఎవరికి తెలియదని చెబుతారు, కొన్ని సంవత్సరాల క్రితం ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీలు ప్రస్తుతం ఆలయం ఉన్న కొండ ప్రాంతాన్ని తవ్వి రోడ్డు మార్గం వేయమంటూ గ్రామ పెద్దల నిర్ణయంతో అలా తువ్వే క్రమంలోనే ఇక్కడ 27 నవంబర్ 2015 కార్తీక మాసంలో లభించిన మహా విష్ణువు విగ్రహంతోపాటు శిలాశాసనం. బయటపడడం జరిగింది,అరుదైన విష్ణు మూర్తి విగ్రహం కావడం.. దానిపైన దశవతార రూపాలు ఉండడం. విగ్రహం చెక్కుచెదరకపోవడం చూశాక. వరకాంతం జంగారెడ్డి సారధ్యంలో గ్రామస్తులంతా కలిసి చర్చించుకొని స్వామి విగ్రహాన్ని తమ ప్రాంతంలోనే ప్రతిష్టించాలని, నిర్ణయించుకున్నారు, అయితే ఆ కొండపైనే శిథిలావస్థలో ఆలయం ఉండడంతో దాన్ని నిర్మించేందుకు సిద్ధమయ్యారని తెలిపారు, వరకాంతం జంగారెడ్డి నేతృత్వంలో కమిటీగా ఏర్పడి విరాళాలు సేకరించి, ఆలయాన్ని నిర్మించి గర్భగుడిలో ఇప్పటికే ఉన్న పీఠం పైన స్వామి విగ్రహాన్ని ప్రతిష్టించినట్లుగా చెబుతున్నారు.

### ప్రత్యేక ఉత్సవాలు

21-12-2015 రోజున వైకుంఠ ఏకాదశి నాడు ప్రతిష్టాపన చేసుకుని నాటి నుంచి నేటి వరకు వైకుంఠ ఏకాదశి రోజు అష్టమ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు,ఇక్కడ రోజువారి చేసే పూజలతో పాటు ప్రతి ఏకాదశి నాడు స్వామికి అభిషేకం, సుదర్శన నరసింహ యాగం నిర్వహిస్తారు, వైకుంఠ ఏకాదశి మూడు రోజులపాటు ప్రత్యేకంగా బ్రహ్మోత్సవాలను జరపడం విశేషం ఆ సమయంలో నిర్వహించే స్వామి కళ్యాణాన్ని చూసేందుకు రెండు కండ్లు చాలా వంటారు ప్రజలు

# ప్రజా సమస్యలపై సత్వర న్యాయం జరుగుతుందనీ భరోసా కల్పించాలి

## చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన శిక్ష

## రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్





మందమర్రి డిసెంబర్ 31: వార్త మిర్రర్ ప్రతినిధి : పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదు దారులతో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని, ప్రజలు తమ సమస్యలతో పోలీస్ స్టేషన్ కు వస్తే వెంటనే స్పందించి బాధితులకు సత్వర న్యాయం జరిగుతుందని భరోసా కల్పించాలని రామగుండం పోలీసు కమిషనర్ ఎం శ్రీనివాస్ సూచించారు. వార్షిక తనిఖీలలో బాగంగా మంగళ వారం పట్టణంలోని సీఐ కార్యాలయాన్ని,పోలీసు స్టేషన్ ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ కు చేరుకున్న పోలీస్ కమిషనర్ కి పోలీస్ అధికారులు మొక్కలను అందించి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా సిపి సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీస్ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం పోలీస్ స్టేషన్ రిసెప్షన్ సిబ్బంది పనితీరును పరిశీలించారు. స్టేషన్ కు వచ్చే ప్రతి దరఖాస్తు పై తప్పనిసరిగా పిటిషన్ మేనేజ్మెంట్ లో అప్లోడ్ చేసి రిసిప్ట్ ఇవ్వాలని వచ్చిన ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు చేపట్టారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ లోని లాక్ అప్ రూమ్, రైటర్ రూమ్, రికార్డ్స్ రూమ్ పరిశీలించారు. అనంతరం సర్కిల్, పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పెండింగ్ కేసులు, నిందితుల అరెస్ట్, కోర్ట్ లో పెండింగ్ లో వున్న కేసులు, వాటికి సంబందించిన దర్యాప్తు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిదంగా స్టేషన్ లో నిర్వహిస్తున్న పలురకాల రికార్డులను పోలీస్ కమిషనర్ పరిశీంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల నియంత్రణకై పోలీస్ స్టేషన్ పరిధిలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని, ప్రజల భద్రత మనందరి బాధ్యతని, ప్రధానంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లపై, ట్రబుల్ మాంగర్స్ పై ప్రత్యేక నిఘా పెట్టాలని, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపట్ల కఠినంగా వ్యవహారించాలన్నారు. అదే సందర్భంలో స్టేషన్ కు వచ్చే ఫిర్యాదు దారులతో మర్యాద గా నడుచుకోవాలన్నారు. ప్రజలు పోలీస్ స్టేషన్ కు వచ్చి ఏలాంటి సమస్య, సందేహాలు, సలహాలు, సూచనలు అడిగే లాగా ప్రజలకు వున్న నమ్మకానికి తగ్గట్టుగా విధులు నిర్వర్తించి ప్రజల నమ్మకాన్ని పొందాలన్నారు. ఈ తనిఖీల్లో మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్, సీఐ శశి ధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ తోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులు కష్టపడి చదివి పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి







మిర్యాలగూడ డిసెంబర్ 31:-( వార్త మిర్రర్) : పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు విద్యార్థినులు కష్టపడి చదవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం ఆమె నల్గొండ జిల్లా, మిర్యాలగూడ డివిజన్ కేంద్రంలోని జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి సెక్షన్ ఈ-3 ఈ 1లకు వెళ్లి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి వారి విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. పదో తరగతి ఈ -3 సెక్షన్లో గణితంపై ముఖ్యంగా సంభావ్యతపై విద్యార్థినులను ప్రశ్న, జవాబులు అడగడమే కాకుండా, బోర్డుపై లెక్కలను వేసి సమాధానాలను రాబట్టారు. మీకు ఏ సబ్జెక్టు అంటే ఇష్టం? ఏ టీచర్ ఇష్టం ?ఎంతమంది హాస్టల్లో ఉంటూ చదువుకుంటున్నారని? పాఠశాలలో విద్యాబోధన ఎలా ఉందని? భోజనం ఎలా ఉందని? తదితర వివరాలన్నింటిని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ పాఠశాల వంటగదిని తనిఖీ చేశారు. వంటగదిలోకి బల్లులు, పురుగులు వంటివి రాకుండా కిటికీలకు మెష్ ఏర్పాటు చేయాలని ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమారిని ఆదేశించారు. అలాగే నూతనంగా ఏర్పాటు చేసిన డైనింగ్ హాల్లో ఫ్యాన్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్తినిలతో మాట్లాడుతూ బాగా కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని, పదవ తరగతి అన్నింటికి పునాది వంటిదని చెప్పారు. సమయం వృధా చేసుకోకుండా అన్ని అంశాల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. పాఠశాల హెడ్మాస్టర్ తో ఆమె మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థినుల సంఖ్య, విధ్యా బోధన, భోజనం, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారిని కృష్ణవేణి, మున్సిపల్ కమిషనర్ ఎండీ.యూసుఫ్, మండల విద్యాశాఖ అధికారి బాలు, ఉన్నారు.

## యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్



యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజలకు యాదాద్రి లక్ష్మి నరసింహ స్వామి దివ్య ఆశీస్సులతో ఈ 2025 ఏడాది ప్రజల జీవితంలో వెలుగులు నింపే ప్రత్యేకమైన సంవత్సరంగా మారాలని కోరుకుంటూ.. నూతన సంవత్సరం శుభాకాంక్షలు. తెలిపారు, డాక్టర్ ర్యాకల శ్రీనివాస్. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సంవత్సరం గత ఏడాది కంటే స్నేహం, ప్రేమ, సేవ,నవ్వులతో నిండాలని కోరుకుంటూ యాదాద్రి జిల్లా ప్రజలకు వ్యవసాయం, వ్యాపారంలో మంచి లాభాలు రావాలని, విద్య, ఉపాధి, ఆకాశాలు అందరికీ అందాలని, జిల్లా ప్రజలు ఆర్థికంగా బలపడాలని, కోరుకుంటూ జిల్లా ప్రజల అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. తెలిపారు డా. ర్యాకల శ్రీనివాస్

## తులం బంగారం 90 వేలు!

## ఈ ఏడాది చేరుకోవచ్చన్న అంచనాలు

## కిలో వెండి రూ.1.25 లక్షలను తాకే అవకాశం

## అంతర్జాతీయ ఉద్రిక్తతలు పెరిగితే ధరల పరుగే

## దేశ, విదేశీ మార్కెట్లపై నిపుణుల అభిప్రాయం




న్యూఢిల్లీ, డిసెంబర్ 31: బంగారం ధరలు కొత్త ఏడాదిలోనూ రికార్డుల మోత మోగించడం ఖాయమన్న అభిప్రాయాలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే దేశీయ మార్కెట్లో తులం 24 క్యారెట్ పసిడి రేటు 2025లో రూ.85,000 స్థాయికి వెళ్తుందని మార్కెట్ నిపుణులు అంటున్నారు. అయితే అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చిత పరిస్థితులు కొనసాగితే ఏకంగా రూ.90,000 మార్కును తాకవచ్చునీ చెప్తుండటం గమనార్హం. నిజానికి 2024లోనూ గోల్డ్ రేట్లు బాగానే పరుగులు పెట్టాయి. అక్టోబర్ 30న ఆల్టైమ్ హైని చేరుతూ 24 క్యారెట్ 10 గ్రాముల పుత్తడి విలువ రూ.82,400 పలికింది. అయితే ఆ తర్వాత క్రమేణా రేట్లు పడిపోయాయి. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో తులం రూ.79,350గా ఉన్నది. ఇక మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)పై ఫ్యూచర్స్ ట్రేడింగ్లో రూ.76,600గా నమోదైంది. ఈ నేపథ్యంలో నూతన సంవత్సరం స్పాట్ మార్కెట్లో ధరలు తిరిగి విజృంభించే అవకాశాలే ఉన్నట్టు ఎక్స్పర్ట్స్ చెప్తున్నారు. అయితే ప్రథమార్ధం (జనవరి-జూన్)లో మార్కెట్ ఒడిదొడుకులకు గురైనా.. ద్వితీయార్ధం (జూలై-డిసెంబర్)లో మాత్రం ఎంసీఎక్స్లో రూ.73,000-73,500 శ్రేణిలో ట్రేడ్ కావచ్చని, అంతర్జాతీయంగా ఔన్స్ 2,455 డాలర్లు పలుకవచ్చన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

### గ్లోబల్ మార్కెట్లో..

అంతర్జాతీయ మార్కెట్లో పుత్తడి ధరలు పెరగడం కూడా భారతీయ మార్కెట్లో రేట్లను పరుగులు పెట్టిస్తున్నాయి. 2024లో కొమెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్లో ఔన్స్ ధర 2,062 డాలర్లుగా మొదలైంది. అక్టోబర్లో అది గరిష్ఠంగా 2,801.8 డాలర్లకు చేరింది. దీంతో ఇన్వెస్టర్లకు 28 శాతం వరకు రిటర్న్స్ వచ్చినెట్టైంది. ఈ క్రమంలో 2025లోనూ గోల్డ్పై మదుపు చేసేవారికి భారీ లాభాలే వస్తాయని ట్రేడింగ్ విశ్లేషకులు చెప్తున్నారు. ఔన్స్ 3,200 డాలర్లకు వెళ్లవచ్చని అంటుండటం విశేషం. దీంతో ఎంసీఎక్స్లో 10 గ్రాములు రూ.87,000లుగా ఉంటుందన్న అంచనాలున్నాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్-హమాస్ పరస్పర దాడులతో వేడెక్కిన పశ్చిమాసియా పరిస్థితులు, ఆయా దేశాల సెంట్రల్ బ్యాంకులు పసిడి కొనుగోళ్లకు పెద్దపీట వేయడం, వడ్డీరేట్లను తగ్గించడం వంటివి బంగారానికి మరింత డిమాండ్ తెచ్చిపెట్టే వీలుందని వారు అభిప్రాయపడుతున్నారు. గడిచిన రెండు సంవత్సరాల్లో ఏటా 1,000 టన్నులకుపైగా సెంట్రల్ బ్యాంకులు బంగారాన్ని కొన్నాయని గుర్తుచేస్తున్నారు.